


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

07.08.2026
శుక్రవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 86
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# గొడ్డలి పార్టీకే చెల్లింది

## గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ నా?.. సీఎం చంద్రబాబు సంచలన కామెంట్లు

- వైకాపా కార్యకర్తలు పరిధి దాటి ప్రవర్తించారని ఆగ్రహం
- దేవరపల్లిలో జగన్ పర్యటన సందర్భంగా..
- పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శా?
- మంత్రి వర్గ భేటీలో మంత్రులతో సీఎం
- ఓ మహిళా చిరువ్యాపారి పొట్టగొట్టారు
- రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్
- అమరావతి ట్విన్ టవర్స్
- 2 కొత్త ప్రైవేట్ వర్సిటీలు



**అమరావతి, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జగన్ పర్యటన సందర్భంగా వైకాపా కార్యకర్తలు పరిధి దాటి ప్రవర్తించారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని విమర్శించారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. "దేవరపల్లిలో వైకాపా శ్రేణులు ఓ మహిళా చిరువ్యాపారి పొట్టగొట్టారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారు. గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పకోవడం గొడ్డలి పార్టీకే చెల్లింది. ఆక్వా ఫీడ్ ఎగుమతులను 50 శాతం తగ్గించేందుకు కేంద్రం సానుకూలంగా ఉంది. పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించామనే అసూయతో వైకాపా కుట్రలు చేస్తోంది. డీఎస్సీపై కేసులను కొట్టేసి.. కోర్టులు చీవాట్లు పెడుతున్నా వారు బుద్ధి మార్చుకోవడం లేదు. హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ఈనెల 13న సీడ్ యాక్సిస్ రహదారిని ప్రారంభిస్తాం. 250 మీటర్ల ఎత్తుతో దుబాయ్ ఐ వీల్ ప్రపంచంలో అతి ఎత్తైనదిగా ఉంది. దుబాయ్ ఐ వీల్ కంటే.. అమరావతి ఐ వీల్ పెద్దదిగా ఉండాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**అమరావతి ట్విన్ టవర్స్ నిర్మాణం: కేబినెట్ నిర్ణయాలు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో సమావేశమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఈ కేబినెట్ సమావేశంలో మొత్తం 34 అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి అభివృద్ధి, విద్య, పరిశ్రమలు, మౌలిక వసతులు, చట్ట సంస్కరణలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాజధాని అమరావతి అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి రూ.1,002.49 కోట్ల వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీకి అప్పగించేందుకు కూడా అనుమతి ఇచ్చింది. అదనంగా అసెంబ్లీ, హైకోర్టు ఐకానిక్ భవనాల డిజైన్ల పూర్తి కోసం అదనపు నిధుల కేటాయింపుకు అంగీకారం తెలిపింది. అమరావతి భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం (జీఓఎం) చేసిన సిఫార్సులను ఏపీ కేబినెట్ ఆమోదించింది. అలాగే 'అమరావతి ఐ' ప్రాజెక్టుకు రీటెండర్లు నిర్వహించేందుకు కూడా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్2026 ముసాయిదాతో పాటు ఏపీ పీపీపీ పాలసీ2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ భూముల్లో మొబైల్ టవర్ల ఏర్పాటుకు.. రాయితీ విద్యుత్ అందించేందుకు కూడా అనుమతి ఇచ్చింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన దిశా బిల్లు2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు2024లను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కేబినెట్ నిర్ణయించింది.

2లో..

## మా చట్ట ప్రకారం నడవాల్సిందే..

- మెటాకు కేంద్రం వార్నింగ్
- అమెరికా చట్టాలు ఇక్కడ నడవవు 2లో..




## క్యా బోల్తీ పబ్లిక్

- నిరుద్యోగం, విద్యా సంస్కరణలపై
- సీజేపీ దేశవ్యాప్త ప్రచారం
- కీలక అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తాం



2లో..

## ఈ సభ తెలంగాణలో కొత్త చరిత్రకు నాంది

- అణగారిన వర్గాల కోసం
- చివరి వరకూ పోరాటం చేస్తా
- టీఆర్ఎస్ చీఫ్ కవిత
- ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకు..
- సామాజిక న్యాయం కోసం పాటుపడలేదు 2లో..



## ప్రధాని మోదీ విదేశీ టూర్ల ఖర్చు 550 కోట్లు

- వచ్చిన ఎఫ్‌డీఐలు 30 లక్షల కోట్లపైనే..
- విదేశాంగ శాఖ వివరాలు వెల్లడి
- 2025లో మొత్తం 23 దేశాల్లో పర్యటించగా..
- ఇందుకోసం రూ.187 కోట్లు ఖర్చు 2లో..

**న్యూఢిల్లీ, ఆగస్టు 06, అనంత జనశక్తి న్యూస్**

ప్రధాని మోదీకి విదేశీ ప్రయాణాల ఖర్చులకు సంబంధించి విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. 2025లో మొత్తం 23 దేశాల్లో పర్యటించగా, ఇందుకోసం రూ.187 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపింది. 2021 నుంచి విదేశీ ప్రయాణాల కోసం మొత్తంగా సుమారు రూ.550 కోట్లకుపైగా ఖర్చయ్యిందని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.74 కోట్లు ఖర్చు అయినట్లు పేర్కొంది. ప్రధాని మోదీ 2021 నుంచి ఇప్పటివరకు ఏయే దేశాల్లో పర్యటించారు? ఒక్కో దేశ పర్యటనకు అయిన ఖర్చు ఎంత? తదితర వివరాలపై రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు విదేశాంగశాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- మంత్రులకు లోకేశ్ దిశానిర్దేశం!
- బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో సూచనలు
- అనుకున్న సమయానికే స్థానిక ఎన్నికలు
- పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి 2లో..



## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

- మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి
- మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



2లో..

## పవన్ కల్యాణ్ మానవత్వం

- కళాకారుల ఆరోగ్యానికి ప్రత్యేక చర్యలు
- 141 మందికి కళ్లజోడు అందజేశారు

2లో..

**అమరావతి, ఆగస్టు 06, అనంత జనశక్తి న్యూస్**

నిరంతర ఒత్తిడితో కుంగిపోయిన వారి జీవితాల్లోకి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొత్త వెలుగును తీసుకువస్తున్నారు. కేవలం వైద్య పరీక్షలు నిర్వహించి అక్కడితో ఆగకుండా, ఆయన 141 మందికి కళ్లజోడు అందజేశారు. గత నెలలో, విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ నిర్వహించిన హస్తకళల మహోత్సవ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్ హాజరైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కళాకారులతో డిప్యూటీ సీఎం గాఢమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హస్తకళాకారులు తమ వృత్తిలో నిమగ్నమైనప్పుడు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



## 1.05 కోట్ల మందికి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

### నూతన రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్
### ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా
### రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ




**హైదరాబాద్, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం తుది ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నూతన అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి స్వయంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ ప్రక్రియ మొదలవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ పంపిణీ కార్యక్రమాలు సాగుతాయి. 2లో..

## జగన్ బయటకు వస్తే విధ్వంసమే..

- పరామర్శల పేరుతో అరాచకం
- మంత్రి అనిత ఘాటు వ్యాఖ్యలు
- పరామర్శ యాత్రల పేరుతో ఉద్రిక్త పరిస్థితులు 2లో..



## ఏ రోజూ జై తెలంగాణ రేవంత్ అనలేదు

- మాజీ మంత్రి సంచలన ఆరోపణ
- తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనలే
- ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నాడు



**హైదరాబాద్, ఆగస్టు 06, అనంత జనశక్తి న్యూస్**

జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా త్యాగం చేశారని, కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, కనీసం 'జై తెలంగాణ' అని అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. 2లో..

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

**అమరావతి, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

వైసీపీ సీనియర్ నేత, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న దీక్షా శిబిరాలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. డీఎస్సీ2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ అంశంపై నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నిర్వహిస్తున్న దీక్షా శిబిరంపై దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని బొత్స అన్నారు. టెంట్లు ధ్వంసం చేయడంతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారని ఆరోపించారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులు, బాధితులపైనే చర్యలు తీసుకుని మల్లాది విష్ణును అదుపులోకి తీసుకెళ్లారని విమర్శించారు.

మల్లాది విష్ణును పోలీస్ వ్యాన్‌లో తరలిస్తున్న సమయంలో పార్టీ జెండా కర్రతో దాడి జరిగిందని, దీక్షా శిబిరంలోని టెంట్‌పై మూత్ర విసర్జన చేసిన ఘటన రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శిబిరాలను పలుచోట్ల పోలీసులు తొలగించారని, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న నిరసనలను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలపై తమ పార్టీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందిపోయి, ఆందోళనలను అణచివేసే చర్యలకు పాల్పడుతోందని బొత్స విమర్శించారు. ఎన్ని దాడులు, దౌర్జన్యాలు జరిగినా తమ ఉద్యమం ఆగదని, డీఎస్సీ అక్రమాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు బొత్స సత్యనారాయణ..

# క్యా బోల్తీ పబ్లిక్

**న్యూఢిల్లీ, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' (ప్రజలు ఏమంటున్నారు) పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు .

మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరపున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యా సంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు.

# జగన్ బయటకు వస్తే విధ్వంసమే..

**అమరావతి, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత... రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టుబడులు, పరిశ్రమల కోసం దేశ విదేశాల్లో పర్యటిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా ప్రతిపక్షం మాత్రం ప్రజలకు ఉపయోగపడే అంశాలపై మాట్లాడకుండా పరామర్శ యాత్రల పేరుతో ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తోందని మంత్రి ఆరోపించారు. జగన్ బయటకు వచ్చిన ప్రతిసారీ విధ్వంసం, అరాచకం జరుగుతోందని విమర్శించారు. మహిళలపై దాడులు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడిగితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, బలప్రదర్శనలతో రాజకీయాలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.

పోలీసులను బెదిరించేలా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రతిపక్ష నేతల వ్యవహారం ఉందని మంత్రి అనిత ఆరోపించారు. కల్తీ మద్యం కేసులో నిందితులను పరామర్శించేందుకు వెళ్తున్నారని, అయితే బాధిత కుటుంబాలను పరామర్శించడంలో ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. సిదిరి అప్పలరాజు కుమారుడు దానయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందినా, ఆ కుటుంబాన్ని జగన్ పరామర్శించలేదని గుర్తు చేశారు. రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమని, విధ్వంస రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని మంత్రి అనిత పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం శాంతి, అభివృద్ధి, పెట్టుబడులే అవసరమని, ప్రజలు వాస్తవాలను గమనించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆమె కోరారు.

# ప్రధాని మోదీ విదేశీ టూర్ల ఖర్చు 550 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాదిలో ఇప్పటివరకు పీఎం చేపట్టిన విదేశీ పర్యటనల కోసం రూ.74.58 కోట్లు ఖర్చు అయ్యింది. జులై 6 నుంచి 11 వరకు ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించారు.

విదేశీ పర్యటనల కోసం గతేడాది (2025లో) రూ.187 కోట్లు, 2024లో రూ.109 కోట్లు, 2023లో రూ.93 కోట్లు, 2022లో రూ.55 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చయినట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది (2025) మొత్తంగా 23 దేశాల్లో పర్యటించారు. ఫ్రాన్స్ (రూ.25 కోట్లు), అమెరికా (రూ.16 కోట్లు), సౌదీ అరేబియా (రూ.15 కోట్లు), బ్రెజిల్ (రూ.17 కోట్లు), చైనా (రూ.10 కోట్లు), బ్రిటన్ (రూ.9 కోట్లు) తదితర దేశాల్లో ప్రధాని మోదీ అధికారిక పర్యటనలు చేశారు. మారిషస్, థాయ్‌లాండ్, శ్రీలంక, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియా, మాల్దీవులు, జపాన్, భూటాన్, దక్షిణాఫ్రికా, జోర్డాన్, ఒమన్, ఇథియోపియా దేశాల్లోనూ ప్రధాని మోదీ పర్యటించారు.

వివిధ దేశాలతో సన్నిహిత సంబంధాలను పెంపొందించడానికి.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి అత్యున్నత స్థాయి పర్యటనలు దోహదం చేస్తాయని విదేశాంగ శాఖ పేర్కొంది.

ఈ పర్యటనల (ఏప్రిల్ 2021 డిసెంబర్ 2025 మధ్య) సందర్భంగా చేసుకున్న అవగాహన ఒప్పందాల్లో భాగంగా సుమారు 381 బిలియన్ డాలర్ల (రూ.30 లక్షల కోట్ల కన్నా ఎక్కువ) విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది.

# డిజిటల్ అరెస్ట్ ఉచ్చులో వృద్ధ దంపతులు

**- కృష్ణాజిల్లాలో రూ.1.43 కోట్ల సైబర్ మోసం**

**- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పేరుతో కాల్**

**అనంతపురం, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

కృష్ణాజిల్లాలో భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. మచిలీపట్నానికి చెందిన వృద్ధ దంపతులు అలివేలు, మంగమ్మలను 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భయభ్రాంతులకు గురిచేసిన సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.1.43 కోట్లు కాజేశారు. ఢిల్లీ నుంచి మాట్లాడుతున్న అధికారులమంటూ ఫోన్ చేసిన కేటుగాళ్లు, రూ.587 కోట్ల మనీ ల్యాండరింగ్ కేసులో ఉపయోగించిన బ్యాంక్ కార్డుతో వారి ఖాతాకు సంబంధం ఉందని నమ్మించారు. అంతే కాకుండా బాధితులపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందని, అరెస్ట్ నుంచి తప్పించుకోవాలంటే వెంటనే డబ్బులు బదిలీ చేయాలని బెదిరించారు. వారి మాటలను నిజమని నమ్మిన వృద్ధ దంపతులు జూలై 10 నుంచి జూలై 29 మధ్య మూడు దఫాలుగా తమ మూడు బ్యాంకు ఖాతాల నుంచి మొత్తం రూ.1.43 కోట్లు బదిలీ చేశారు.

డబ్బులు తీసుకున్న తర్వాత కూడా సైబర్ నేరగాళ్లు ఆగలేదు. మరో రూ.95 లక్షలు పంపించాలని ఒత్తిడి చేస్తూ, అవసరమైతే ఇంట్లో ఉన్న బంగారం, వెండి తాకట్టు పెట్టి అయినా డబ్బులు చెల్లించాలని బెదిరించారు. దీంతో అనుమానం వచ్చిన బాధితులు తమకు తెలిసిన వారికి విషయం చెప్పగా, ఇది సైబర్ మోసమని గుర్తించారు. ఆ తర్వాత వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు డబ్బు బదిలీ అయిన ఖాతాలు, కాల్ వివరాలు, సైబర్ నేరగాళ్ల జాడపై దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి 'డిజిటల్ అరెస్ట్' పేరుతో వచ్చే కాల్స్, వీడియో కాల్స్ లేదా డబ్బు బదిలీ చేయాలన్న ఆదేశాలను ప్రజలు నమ్మొద్దని, అనుమానం వస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ మానవత్వం

(మొదటిపేజీ తరువాయి)

నరసాపురం నియోజకవర్గంలోని పసలదివికి చెందిన క్రోచెట్ లేస్ కళాకారిణి మహాలక్ష్మి తన ఆరోగ్య సమస్యలను వివరించారు.

**141 మందికి కళ్లద్దాలను అందజేసిన పవన్..**

గంటల తరబడి చిన్న చిన్న నమూనాలను చూస్తూ ఉండటంతో తన కంటిచూపు క్షీణిస్తోందని మహాలక్ష్మి వివరించారు. తనకు కంటి పరీక్షలు చేయాలని ఆమె అభ్యర్థించారు. అదే వేదికపై ఉన్న పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించారు. ఏపీ వ్యాప్తంగా హస్తకళాకారుల కోసం క్లస్టర్ల వారీగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. గత నెల నరసాపురంలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం నిర్వహించిన కంటి సంరక్షణ శిబిరంలో, 141 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఆ 141 మందికి కళ్లద్దాలను డిప్యూటీ సీఎం అందజేశారు. అలాగే, మరిన్ని కంటి సంరక్షణ శిబిరాలకు సన్నాహాలు కొనసాగుతున్నాయి.

క్లస్టర్ల వారీగా ఉచిత వైద్య శిబిరాలు..

పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, హస్తకళాకారుల కోసం ఉచిత వైద్య శిబిరాలు క్లస్టర్ల వారీగా కొనసాగుతున్నాయి. క్రోచెట్ లేస్ కళాకారుల కోసం నిర్వహించిన మొదటి కంటి సంరక్షణ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు సిద్ధం చేశారు. అలాగే, పోలవరం ప్రాంతంలోని ఏలమంచిలి, అత్తిలిలో మరో రెండు శిబిరాలు పూర్తి అయ్యాయి. ఈ రెండు శిబిరాల్లో దృష్టి లోపాలతో గుర్తించిన మరో 350 మందికి కూడా ఉప ముఖ్యమంత్రి కళ్లద్దాలు అందజేస్తున్నారు. 20 మందికి పైగా వ్యక్తుల్లో శుక్లాల సమస్యలను వైద్యులు గుర్తించారు. వారికి శస్త్రచికిత్స చికిత్సలు అందిస్తున్నారు. క్రోచెట్ లేస్ కళాకారుల కోసం అచాంట్, నరసాపురంలో మరో రెండు కంటి సంరక్షణ శిబిరాలను నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ యోచిస్తున్నారు.

# మా చట్ట ప్రకారం నడవాల్సిందే..

**న్యూఢిల్లీ, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

ప్రస్తుతం భారత ప్రభుత్వంమెటా మధ్య ఫైటింగ్ నడుస్తోంది. ప్రధాని మోదీ వీడియోను ఫేస్‌బుక్ నుంచి తొలగించడంపై కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెప్పాల్సిందేనని కేంద్రం పట్టుబట్టడంతో మెటా సీఈవో జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పారు.

తాజాగా మెటాకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. సోషల్ మీడియా దిగ్గజం మెటా సహా అన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు అమెరికా రాజ్యాంగం ప్రకారం కాకుండా భారత రాజ్యాంగం, భారత చట్టాల ప్రకారమే వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల మెటాకు సంబంధించిన వివాదాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తీవ్రంగా స్పందించింది.

ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. మెటా గ్లోబల్ బృందంతో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఈ సందర్భంగా సంస్థ ఉపయోగిస్తున్న అల్గారిథమ్‌లు, నిబంధనల అమలు విధానం, తనిఖీ వ్యవస్థలు, ప్లాట్‌ఫారమ్‌లో అమలవుతున్న భద్రతా ప్రమాణాలు తదితర అంశాలపై కేంద్రం వివరణ కోరనుంది. అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, దేశ చట్టాలను అవి ఉల్లంఘిస్తున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించాయి. అలాగే చెల్లింపు ఆధారంగా ప్రచారం చేసే కంటెంట్‌కు కూడా ప్లాట్‌ఫామ్‌లే బాధ్యత వహించాలా అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, మెటా గ్లోబల్ బృందం మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. భారత రాజ్యాంగం, చట్టాలకు అనుగుణంగా పనిచేసేలా మెటా అమలు చేస్తున్న విధానాలపై కేంద్రం సమగ్రంగా సమీక్షించనుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉన్నప్పటికీ.. అందులో పేర్కొన్న సమంజసమైన పరిమితులను అన్ని సోషల్ మీడియా సంస్థలు తప్పనిసరిగా పాటించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇదే అంశంపై పార్లమెంటరీ సమాచార సాంకేతిక శాఖ స్థాయీ సంఘం సభ్యుడు, ఎంపీ అనూప్ సంజయ్ ధోత్రే

కూడా స్పందించారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించాల్సిందేనని, అయితే దానికి కొన్ని పరిమితులు ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. మెటాతో పాటు అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల దుర్వినియోగం వల్ల కొంతమంది వ్యక్తిగతంగా నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు.

ఇటీవల ప్రధాని మోదీకి సంబంధించిన ఒక సోషల్ మీడియా పోస్టు తొలగించబడిన ఘటనను ప్రస్తావించిన ధోత్రే.. ఈ అంశంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఛైర్మన్ మెటాను క్షమాపణ చెప్పాలని కోరారని తెలిపారు. అనంతరం మెటా ఈ ఘటనపై క్షమాపణలు తెలిపినట్లు పేర్కొన్నారు. అసోచామ్ నిర్వహించిన 3వ ఇండియా ఇంటర్నేషనల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్2026 కార్యక్రమంలో పాల్గొన్న ధోత్రే.. భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని అన్నారు. సాంకేతికత ఆధారిత ఉద్యోగాల సృష్టి, ఆర్థిక సాధికారత, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాల నుంచి రక్షణ వంటి అంశాలపై తదుపరి దశలో దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయం వంటి రంగాల్లో ఫిన్‌టెక్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పరిశ్రమలుఫిన్‌టెక్ సంస్థలుప్రభుత్వం కలిసి పనిచేసే విధానాన్ని బలోపేతం చేయడం ద్వారా వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**హైదరాబాద్, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

కేబినెట్ సమావేశానికి ముందు రాష్ట్ర మంత్రులతో మంత్రి నారా లోకేష్ నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ వ్యూహం, ప్రజా సమస్యలు, ఎల్‌నినో పరిస్థితులు వంటి కీలక అంశాలపై చర్చించారు. అనుకున్న సమయానికే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని మంత్రులకు మంత్రి లోకేష్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాలను గెలుచుకునేలా ప్రతి మంత్రి, ప్రజాప్రతినిధి క్షేత్రస్థాయిలో పని చేయాలని మంత్రి నారా లోకేష్ సమావేశంలో చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన తీరును ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద కనీసం మూడు నిమిషాలైనా గడుపుతూ ప్రభుత్వ పనితీరు, అమలు చేసిన కార్యక్రమాలు, చేపట్టిన అభివృద్ధి చర్యలను ప్రజలకు వివరించాలని లోకేష్ మంత్రులకు సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపైనా సమావేశంలో నారా లోకేష్ మంత్రులతో చర్చించారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను అసెంబ్లీ వేదికగా ప్రజలకు సమగ్రంగా వివరించాలని సూచించారు. ఇటీవల జలాశయాల్లోకి వరద నీరు రావడం కొంత ఊరటనిచ్చే అంశమే అయినప్పటికీ, నీటి వినియోగంలో జాగ్రత్త అవసరమని అన్నారు. నీటి నిర్వహణలో తొలి ప్రాధాన్యాన్ని తాగునీటి అవసరాలకు, ద్వితీయ ప్రాధాన్యాన్ని పశుగ్రాసం, పశుసంవర్ధక అవసరాలకు ఇవ్వాలని లోకేష్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు.

ప్రజా సమస్యలను చర్చించి వాటికి పరిష్కారాలు కనుగొనే వేదికగా అసెంబ్లీని ఉపయోగించుకోవాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పరిపాలనా అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరగాలని.. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో లోకేష్ స్పష్టం చేశారు.

# ఏ రోజూ జై తెలంగాణ రేవంత్ అనలేదు

(మొదటిపేజీ తరువాయి)

సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తాలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజు కూడా జై తెలంగాణ అనలేదని ఆరోపించారు.

తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తుచేసిన హరీశ్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా, ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి, రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, ప్రభుత్వం వద్ద చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందో స్పష్టం చేయాలన్నారు. సమ్మక్క సారక్క (దేవాదుల) ప్రాజెక్టుకు 47 టీఎంసీల హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చిన తర్వాత కూడా తెలంగాణ ప్రభుత్వం దానిని ఎందుకు వదులుకుంటోందో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎస్సారెస్పీ స్టేజ్ 2 ద్వారా వరంగల్, నల్గొండ జిల్లాలకు నీరందించే ఈ ప్రాజెక్టును వదులుకోవడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మొదట అజెండాలో లేదన్నారని, ఆ తర్వాత ఢిల్లీ మీటింగ్‌లో చేర్చారని, సమావేశానికి హాజరుకామని చెప్పి వెళ్లి సంతకాలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం కోర్టుల్లో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఫ్లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

# గొడ్డలి పార్టీకే చెల్లింది

(మొదటిపేజీ తరువాయి)

వీటి స్థానంలో ప్రజల భద్రత, భూముల రక్షణకు మరింత సమర్థవంతమైన కొత్త చట్టాలను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఉన్నత విద్యను విస్తరించే లక్ష్యంతో 2 కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే కొత్త జిల్లాల్లో విద్యా పరిపాలనను బలోపేతం చేయడానికి 15 కొత్త జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) పోస్టుల సృష్టికి కూడా ఆమోదం తెలిపింది. మున్సిపల్ భూముల లీజు గడువును పెంచేలా చట్ట సవరణలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పునర్వ్యవస్థీకరణకు కూడా అంగీకారం తెలిపింది. అదేవిధంగా పాదచారుల భద్రత పాలసీ 2026, విశాఖలో మురికివాడల అభివృద్ధికి కొత్త విధానానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టెక్స్‌టైల్స్ పాలసీలో వేతన సబ్సిడీ నిబంధనలకు సవరణలు చేయడంతో పాటు, కొత్త పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పారిశ్రామిక అవసరాల కోసం భూముల కొనుగోలుకు ఏపీఐఐసీకి అనుమతి ఇవ్వడంతో పాటు.. తీవ్ర నష్టాల్లో ఉన్న 3 సహకార చక్కెర కర్మాగారాలను లిక్విడేషన్ చేయాలని నిర్ణయించింది. రూ.210.06 కోట్లతో భక్తుల సౌకర్యార్థం గోదావరి



పుష్కర ఘాట్ల అభివృద్ధికి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 4 రోజుల పాటు వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చ జరగనుంది.

# ఈ సభ తెలంగాణలో కొత్త చరిత్రకు నాంది

**హైదరాబాద్, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్**

సామాజిక న్యాయ తెలంగాణను తీర్చాదిద్దాడానికి ముందున్నామని టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత తెలిపారు. గురువారం సరూర్‌నగర్‌లో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో మాట్లాడుతూ.. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకు సామాజిక న్యాయం కోసం పాటుపడలేదని విమర్శించారు. ఈ సభ తెలంగాణలో కొత్త చరిత్రకు నాంది పలుకుతుందని, అనేక మంది జీవితాల్లో మార్పు తీసుకురానుందని వెల్లడించారు. సామాజిక న్యాయం అనగానే అందరూ భయపడుతున్నారని.. అయితే ఇది ధర్మపోరాటమని కవిత అన్నారు. రాష్ట్రంలో బీసీలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరస్పరం ప్రేమ లేఖలు రాసుకుంటారని.. బీసీ బిల్లుకు ఆమోదం తీసుకురావడంలో ఈ దోస్తీ ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు బీసీ బిల్లుకు ఆమోదం రాకపోతే సంక్రాంతి తర్వాత ఢిల్లీకి వెళ్లి ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు.

తెలంగాణలో ఇప్పటికీ కుల వివక్ష కొనసాగుతోందని కవిత అన్నారు. తాను అగ్రవర్ణ కుటుంబంలో పుట్టినా, అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన వారంతా కూడా బుద్ధుడి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, అలాగే ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కవిత డిమాండ్ చేశారు.

# 1.05 కోట్ల మందికి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోల కు అప్పగించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ వేడుకలు జరగనున్నాయి. కార్డుల సేకరణకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదికల వద్ద మౌలిక వసతులు, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

ఈసారి పంపిణీ చేసే రేషన్ కార్డులను ఆధునిక టెక్నాలజీతో రూపొందించారు. పీవీసీ మెటీరియల్‌తో తయారు చేసిన లామినేటెడ్ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశారు. వాటర్‌ప్రూఫ్‌గా, క్రెడిట్ కార్డు పరిమాణంలో ఉండే ఈ స్మార్ట్ కార్డులు ఎక్కువ కాలం ఉపయోగపడేలా తయారు చేశారు.

ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. రేషన్ లబ్ధిదారుల తుది జాబితాల పరిశీలన, ఈకేవైసీ పూర్తి చేయడం, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాటు వంటి అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

రాష్ట్రంలో ఉన్న పేద కుటుంబాలకు ఆహార భద్రతను కల్పించడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర సంక్షేమ పాలనలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆశాభావం




వ్యక్తం చేస్తోంది.

# ఇకపై 'క్యా బోల్తీ పబ్లిక్': సీజేపీ కీలక ప్రకటన



విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని CJP వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు.
''ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయింది'' అని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ''రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది'' అని ఆయన అన్నారు.

# మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు!

- నియోజకవర్గాల పునర్విభజనపై ముందుకే
- రాహుల్‌తో కేంద్ర మంత్రి రిజిజు ప్రత్యేక భేటీ
- తమ రెండు డిమాండ్లపై తగ్గేది లేదన్న విపక్ష నేత

మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయనుంది. దీనిలో భాగంగానే ప్రధాన విపక్షం కాంగ్రెస్‌తో సంప్రదింపులు ప్రారంభించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని విపక్షాలు పట్టువిడవకుండా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం సుమారు 50 నిమిషాలసేపు భేటీ అయ్యారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ కూడా పాల్గొన్నారు. బిల్లులు ఆమోదం పొందడానికి సహకరించాలని రిజిజు వారికి విజ్ఞప్తి చేశారు. దిల్లీలో ఉద్యమించిన విద్యార్థులపై హింస విషయంలో పార్లమెంటులో అమిత్ షా ప్రకటన చేయాలని, అయోధ్యలో విరాళాల చోరీపై చర్చ జరగాలని రాహుల్ స్పష్టంచేశారు. ఈ డిమాండ్లపై రాజీపడేదే లేదని తెగేసి చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆయన నుంచి రిజిజుకు ఎలాంటి హామీ లభించలేదని తెలుస్తోంది. పునర్విభజన అంశంపై విపక్ష వైఖరి ఏమిటనేది మంత్రి తెలుసుకోగోరారు. రాహుల్‌తో రిజిజు భేటీ కావడం గత పదిరోజుల్లో ఇది రెండోసారి.



**ప్రతి రాష్ట్రంలోనూ 50% సీట్లు పెంపు**

పార్లమెంటులో సంఖ్యాపరంగా కీలకమైన సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే నేతలతోనూ ప్రభుత్వం మాట్లాడనుంది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి మూడింట రెండొంతుల మంది మద్దతు అవసరం. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50% చొప్పున సీట్లు పెంచేలా కొత్త నిబంధనను బిల్లులో చేర్చే అవకాశం ఉంది. గతసారి ప్రత్యేక సమావేశాల్లో 2/3వ వంతు బలం సమీకరించుకోవడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత అధికార కూటమి బలం గణనీయంగా పెరిగింది. వర్షాకాల సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్నాయి. ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపించినా అలాంటిదేమీ లేదని ప్రభుత్వం బుధవారం రాత్రి స్పష్టం చేసింది.

**బ్యాంకర్స్ బుక్ బిల్లుకు ఆమోదం**

బుధవారమూ లోక్‌సభలో నిరసనలు, అవాంతరాలు కొనసాగాయి. బ్యాంకింగ్ వ్యవస్థకు సంబంధించిన డిజిటల్ రికార్డులనూ న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా తీసుకోవచ్చని చెప్పే 'బ్యాంకర్స్ బుక్ ఎవిడెన్స్ బిల్లు 2026'ను గందరగోళం మధ్య మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. 1891 నాటి చట్టం బదులు దీనిని తీసుకువచ్చారు. బ్యాంకర్స్ బుక్ అంటే భౌతిక పుస్తకాలే కాకుండా ఎలక్ట్రానిక్, డిజిటల్, క్లౌడ్ ఆధారిత పత్రాలు అని నిర్వచనాన్ని మార్చారు.

**జిల్లా కోర్టుల్లో 4.98 కోట్ల కేసులు: మేఘ్‌వాల్**

సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల మొత్తం సంఖ్యను 38కి పెంచే బిల్లును రాజ్యసభ ఆమోదించింది. బిల్లుపై చర్చకు న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ సమాధానమిస్తూ హైకోర్టుల్లో 64 లక్షలు, జిల్లా కోర్టుల్లో 4.98 కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు దక్షిణాది రాష్ట్రాల బెంచ్ ఏర్పాటు డిమాండ్లపై ఇప్పటివరకు సర్వోన్నత న్యాయస్థానం నుంచి ఆమోదం రాలేదని చెప్పారు.

## విమానాల ఇంధనంలో ఇథనాల్.. కొట్టిపారేసిన రామ్మోహన్ నాయుడు



విమానాల ఇంధనం ''ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్''లో ఇథనాల్ కలిపే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. విమాన భద్రతపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం వల్ల ప్రయాణికుల్లో అనవసరమైన ఆందోళన నెలకొంటుందని చెప్పారు. ప్రయాణికుల భద్రతే కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్య అంశమని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. .
కేంద్రం ఏటీఎఫ్‌లో ఇథనాల్ కలపాలని యోచిస్తోందని, అది విమాన భద్రతకు ముప్పుగా మారొచ్చని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు పెట్టడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఇథనాల్, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ రెండూ పూర్తిగా వేర్వేరు ఇంధనాలని వివరించారు. ఎస్ఏఎఫ్‌కు అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ గుర్తింపు ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భద్రతా ప్రమాణాలు, పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే దానిని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.

# లైంగిక దాడి కేసు.. తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు



లైంగిక దాడి కేసులో దోషిగా తేలిన తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్ కు పదేళ్ల జైలు శిక్ష పడింది. దీంతో పాటు న్యాయస్థానం రూ.10 లక్షల జరిమానా విధించింది. అతడు నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో జూనియర్ సహోద్యోగినిపై లైంగికదాడి చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు గోవా బెంచ్.. తాజాగా శిక్ష ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించగా.. ఆ తీర్పును హైకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే.
2013లో గోవాలో జరిగిన థింక్ ఫెస్ట్ ఈవెంట్‌లో పాల్గొన్న సమయంలో హోటల్ ఎలివేటర్‌లో తేజ్‌పాల్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబరులో అతడిని అరెస్టు చేయగా.. ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ కేసుపై 2017లో మాపులా ట్రయల్ కోర్టులో విచారణ ప్రారంభం కాగా.. తేజ్‌పాల్‌ను నిర్దోషిగా తేలుస్తూ 2021లో న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దానిని గోవా ప్రభుత్వం హైకోర్టులో సవాలు చేసింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదలను వినిపించారు. తీర్పు అనంతరం ఆయన మాట్లాడుతూ.. ''తేజ్‌పాల్‌ను తక్షణమే అరెస్టు చేయాలి. బాధితురాలికి తండ్రి వయసులో ఉన్న అతడు ఈ నేరానికి పాల్పడ్డాడు. బాధితురాలి నిరాకరణను పట్టించుకోలేదు. ఒక అమ్మాయి వద్దంటే.. దాని అర్థం వద్దనే. దీనిపై ఈ కోర్టు సమాజానికి గట్టి సందేశం ఇవ్వాలి'' అని మెహతా పేర్కొన్నారు. మరోవైపు, ఈ కేసులో తానే బాధితుడినని, కనికరం చూపించాలని ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అయిన తేజ్‌పాల్ విచారణ సందర్భంగా కోర్టును కోరాడు. ''ఇప్పుడు నా వయసు 62. నేనొక బాధితుడిని. నాకు భార్య ఉంది. ఇంతకుమించి నేను చెప్పడానికి ఏమీ లేదు. మేం అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. దయచేసి నాపై కనికరం చూపండి. వాస్తవాలన్నీ రికార్డు చేసే ఉన్నాయి'' అని అభ్యర్థించాడు. అయితే, ఆయన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది.

## నీట్‌లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి: కేంద్రం

నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి చెబుతామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జేఈఈ తరహాలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్-యూజీ నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి చెబుతామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జేఈఈ తరహాలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్-యూజీ నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.




## కారును ఢీకొట్టిన బైక్.. బానెట్‌పై ఎగిరిపడ్డ యువకులు



రాజస్థాన్‌లోని సిరోహి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అబు రోడ్ జంక్షన్‌లో అతివేగంగా వెళ్తున్న బైక్.. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరి కారు బానెట్‌పై పడ్డారు. అందులో ఒకరు కారుపై నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 3న ఈ ఘటన జరగ్గా.. సీసీకెమెరా దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

## ఎందరికో జీవనదానం చేసి.. నవ్వుతూ వెళ్లిపోయావా నేస్తం!



కేరళలోని తిరువనంతపురానికి చెందిన ఈత, ర్యాపెల్లింగ్ (తాళ్ల సాయంతో కొండ దిగటం) శిక్షకుడు ఆర్.రాజేశ్ (36) రాష్ట్రాన్ని ముంచెత్తుతున్న వరదల్లో చిరస్మరణీయుడైన హీరోగా మారారు. విపత్తు సమయాల్లో ఆపద్బాంధవుడిలా వచ్చి ఎందరినో ఆదుకొన్న ఈ సాహసికుడు ఇక లేడని తెలిసి.. రాష్ట్రమంతా ''వెళ్లిపోయావా నేస్తం!'' అంటూ బరువెక్కిన హృదయాలతో ఆయనకు వీడ్కోలు పలుకుతోంది. 2018 కేరళ వరదల్లో, 2024 నాటి వయనాడ్ కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో ఎందరినో కాపాడిన రాజేశ్ తాజా విపత్తులో చేసిన సాహసం మరపురానిది. కన్నూర్ జిల్లా మీన్‌ఘులీ దీవిలో గత ఆదివారం కరియన్‌గోడ్ నది వరదనీట చిక్కిన కాఫీ తోటల రైతు బెన్నీ (61)ని కాపాడేందుకు వెళ్లిన రాజేశ్ తన ఒంటిపై ఉన్న లైఫ్‌జాకెట్ తీసి ఆయనకు అందించారు. బలమైన ప్రవాహంలో చిక్కుకొన్న ఆ రైతు సురక్షితంగా బయటపడ్డాడు. ప్రవాహ ధాటికి నిలవలేక కొట్టుకుపోయిన రాజేశ్ మృతదేహాన్ని మూడు రోజుల గాలింపు తర్వాత మంగళవారం గుర్తించారు. ''మానవాళి పట్ల రాజేశ్ చూపిన అత్యున్నత త్యాగం, నిస్వార్థమైన ప్రేమ ఎప్పటికీ గుర్తుండిపోతాయి'' అని కేరళ ముఖ్యమంత్రి వి.డి.సతీశన్ 'ఎక్స్' ద్వారా నివాళులు అర్పించారు.

## రోడ్డు ప్రమాదం.. గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కొడుకు మృతి



ఉత్తర్‌ప్రదేశ్ గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ చిన్నకొడుకు అబన్ అహ్మద్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. జైల్లో ఉన్న తన సోదరుడిని కలిసేందుకు వెళ్తుండగా.. ఝాన్సీ ప్రాంతంలో హైవేపై అతడు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో అబన్ తో పాటు మరో నలుగురు వ్యక్తులు ఉన్నారు. ప్రమాద తీవ్రతకు కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అబన్‌తో పాటు మరో వ్యక్తి కూడా మృతి చెందారు. అతి వేగమే ఘటనకు కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతీక్ అహ్మద్‌పై దోపిడీ, కిడ్నాప్, హత్య కేసులు ఉన్నాయి. బీఎస్పీ ఎమ్మెల్యే రాజుపాల్ హత్య కేసులో కీలక సాక్షి అయిన ఉమేశ్ పాల్‌ను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఓ కేసులో జైల్లో ఉన్న అతీక్, అతడి సోదరుడిని 2023 ఏప్రిల్‌లో పోలీసులు వైద్య పరీక్షలకు తీసుకెళ్తుండగా.. ముగ్గురు దుండగులు వారిని కాల్చిచంపారు. కాగా.. పాల్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీక్ మూడో కుమారుడు అసద్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఇక, అతీక్ మరో ఇద్దరు కుమారులు మహమ్మద్ ఉమర్, మహమ్మద్ అలీ ఇతర కేసుల్లో జైల్లో ఉన్నారు. ఉమేశ్ పాల్ హత్య కుట్రలో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న అతీక్ భార్య పర్వీన్ పరారీలో ఉంది. ఇప్పుడు అబన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఒకప్పుడు ఈ గ్యాంగ్‌స్టర్ కుటుంబం తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను నియంత్రించింది.

## ఇన్‌స్టాగ్రామ్ ఖాతాపై ఆంక్షలు.. మెటాపై కేజ్రీవాల్ ఆగ్రహం



తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాపై ఆంక్షలు విధించారని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. దీనిపై మెటా ఇండియా కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించినా స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.
''కేవలం భారత్‌లోనే నా ఇన్‌స్టా ఖాతాకు అంక్షలు ఉన్నట్లు కన్పిస్తోంది. దీని గురించి ఎన్ని ఈమెయిల్స్ చేసినా సమాధానం రావట్లేదు. ఆంక్షలు ఎలా తొలగుతాయో ఎవరూ చెప్పట్లేదు. ఈ సేవలు చాలా చెత్తగా ఉన్నాయి. ప్రధాని ముందు మెటా తలవొంచింది'' అని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ20 పెట్రోల్ వివాదం నేపథ్యంలో తన పోస్టులను నియంత్రించేందుకు మెటా ప్రయత్నిస్తోందని మెటా ఆయన మండిపడ్డారు. అయితే, ఈ ఆరోపణలపై సామాజిక మాధ్యమ సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | అనంతపురం
07.08.2026





# పగ్గాలున్నా పరుగులు ఆపలేరు!

ఊహించినవీ ఉద్దేశించినవీ యథాతథంగా జరగటం మానవజీవితంలో చాలా అరుదు. ఉద్దేశాలు, ఊహలు లేకుండా వ్యక్తులూ ఉండరు. బృందాలూ ఉండవు. కానీ చాలా సందర్భాల్లో వారు ఊహించని, కోరుకోని ఫలితాలు కలుగుతూ ఉంటాయి. అందుకే సంఘటనలను వ్యక్తుల సదుద్దేశాలు, దురుద్దేశాల ఆధారంగా అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తే మనముందు ఎప్పుడూ అసమగ్రచిత్రమే కనపడుతుంది. సోషల్ మీడియాను అభివృద్ధి చేసినవారు ఉద్దేశించింది ఒకటి. జరుగుతోంది మరొకటి. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వాలనూ నిరంకుశ ధోరణులను వ్యతిరేకించే వ్యక్తులకూ శక్తులకూ సోషల్‌మీడియా వేదిక అవుతుందని ఆ మీడియా రూపకర్తలు అనుకోలేదు. మన కళ్లెదుట తీవ్రమవుతున్న కాక్రోచ్ ఉద్యమమే దీనికి నిదర్శనం. ఇప్పటికీ సోషల్ మీడియా యాజమాన్యాల లక్ష్యాలు వేరు. వారి ప్రధాన ఉద్దేశం లాభాలను పొందటమే కావచ్చు. కానీ దానికి భిన్నమైన రాజకీయ లక్ష్యాలకు సోషల్ మీడియా ఆలంబనగా మారుతోంది. అననుకూల భావాలను, ప్రభుత్వాలను ఇబ్బందిపెట్టే రాజకీయ లక్ష్యాలను సోషల్ మీడియా వేదికలపైకి రాకుండా చూడటానికి ఎన్ని వడపోతలూ, జల్లెడలూ పెట్టినా వాటిని నిరోధించలేని స్థాయికి పరిస్థితి వెళ్లింది. కోట్లాదిమందికి భావ భాగస్వామ్యం కల్పించే వేదికలను సృష్టించిన తర్వాత, వ్యాపారమంతా దాని చుట్టూ కేంద్రీకృతమైన తర్వాత అనుకున్నట్లుగా వాటిని నియంత్రించటం ఒకపట్టాన సాధ్యంకాదు. బహుశా మానవచరిత్రలోనే ఇంత విస్తృతస్థాయిలో భావాల మార్పిడికి, భావాల సంఘర్షణకు వందల కోట్ల మందికి అవకాశం కల్పించటం ఎప్పుడూ జరగలేదు. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లకు సమాజంలో ఉన్న భావాల మీద కూడా ఆధిపత్యం ఉంటుందని కారల్ మార్క్స్ ఎప్పుడో సూత్రీకరించారు. అంటే ఆ భావాలు సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి దోహదం చేస్తాయనీ ఆ ఆధిపత్యం సహజసిద్ధమైందన్న భ్రమలో అవి ఉంచుతాయనీ ఆయన చెప్పింది స్థూలంగా నిజమే కావచ్చు. కానీ సోషల్ మీడియా ఆ భావాల పట్టుని కొంతమేరకు కదిలేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను అనుకున్న రీతిలో నియంత్రించలేని విధంగా దాంట్లో ఏర్పాటు ఉండటమే దీనికి కారణం. దాని పునాదే కోట్లాది అభిరుచులు, ఆకాంక్షలు, భావాలు, ఉద్దేశాలపై ఆధారపడి ఉంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. సార్వజనీన ఓటుహక్కులా భావవ్యక్తీకరణ సార్వజనీనం అయిపోతోంది.

విదేశీ విరాళాలను క్రమబద్ధీకరించే పేరిట దేశంలో స్వచ్ఛంద సంస్థలన్నిటినీ ఏదోవిధంగా నియంత్రించి, అవి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ తమ గొంతుకలకు పాక్షికంగానే అవకాశం కల్పిస్తున్నాయన్న భావనకు వచ్చిన తర్వాత అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం ప్రారంభమైంది. పాలకులు చేస్తున్న తప్పలకు జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తూ పదవుల నుంచి దిగిపోవాలని కోరటమూ ఎక్కువైంది. పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం మన దేశంలో ఎన్నడూ జరగలేదు. సోషల్ మీడియా ద్వారా ప్రజలు సంఘటితమవ్వటం కొద్దికాలమే ఉండొచ్చు. అన్యాయాలనూ, అక్రమాలనూ ప్రశ్నించే భావాల వేడి కొద్దికాలం తర్వాత చల్లబడనూ వచ్చు. కాక్రోచ్ ఉద్యమం ఉధృతీ తగ్గొచ్చు. కానీ సంప్రదాయ ప్రతిపక్షాలకు విశ్వసనీయత అంతంతమాత్రంగా ఉన్నప్పుడు తాత్కాలిక ఉద్యమాలు సైతం ప్రజాస్వామ్యాన్ని ఎంతోకొంత మేరకు నిలబెడతాయి. పాలకులను జవాబుదారీ పీఠం ఎక్కేలా చేయగలుగుతాయి. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అవ్వటానికి పరిహారంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని కోరటాన్ని ఈ కోణం నుంచే చూడాలి. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు.

సమాజంలో అన్ని వ్యవస్థలను ఒకే భావజాలానికి అనుగుణంగా మార్చివేసి, అసమ్మతిలేకుండా చేయటానికి గట్టిగా ప్రయత్నాలు జరిగిన చోట వాటిని వ్యతిరేకించటానికి సోషల్ మీడియానే ప్రధాన వాహికగా పనిచేసింది. అరబ్ స్ప్రింగ్ (2010–2012) పేరిట ట్యునీషియా, ఈజిప్టు, లిబియా, యెమెన్‌ల్లో జరిగిన ఆందోళనల్లో సోషల్‌మీడియా నిర్వహించిన పాత్రపై ఎన్నో విశ్లేషణలు వచ్చాయి. ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం కోసమే యువత అక్కడ వీధులకు ఎక్కింది. హాంకాంగ్‌లో 2019 నాటి ప్రజాస్వామ్య ఉద్యమం, ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ పేరుతో వాతావరణ మార్పులపై 150కి పైగా దేశాల్లో జరిగిన ఆందోళనలు, 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగుబాటు, కెన్యాలో జెన్–జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. సోషల్ మీడియా వల్ల అంతా మంచే జరుగుతోందా? చెడు జరగటం లేదా? అని తర్కించుకుంటే వచ్చే సమాధానం భిన్నంగానే ఉంటుంది. ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను ఆధారంచేసుకుని హిట్లర్, ముసోలినీ లాంటి నియంతలు రాజ్యాధిపతులయ్యారు. మత, తెగ ఉద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల ఊచకోతకు కారణమైన సంకుచితత్వ నేతలూ ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకునే అధికార పీఠాలను ఎక్కారు. నిరంతరం ఒక మతాన్ని బూచీగా చూపించి ఆ మతానికి చెందిన ప్రజలను అభద్రతతో జీవించేలా చేస్తున్న నేతలూ ప్రజాస్వామ్యం ఆసరాతోనే వరుసగా ఎన్నికవుతున్నారు. ఈ విపరీతాలూ అనర్థాలూ ఉన్నంత మాత్రాన మొత్తం ప్రజాస్వామ్యాన్నే పక్కన పెట్టలేం. ప్రజాస్వామ్య రాజకీయాలతోనే వాటిని ఎదుర్కొనటానికీ, ఓడించటానికీ ప్రయత్నాలూ, ఉద్యమాలూ జరిగాయి. సోషల్ మీడియాకూ ఇదే వర్తిస్తుంది. చక్రవర్తులూ రాజులూ పాదుషాలూ నవాబులూ అధికారం చలాయిస్తున్న కాలంలో పన్నులు కట్టే వ్యాపారులు.. మాకూ ప్రభుత్వ పాలనలో ప్రాతినిధ్యం ఉండాలని డిమాండు చేయటంతో ప్రజాస్వామ్యానికి బీజాలు పడ్డాయి. పన్నులు కట్టే వారికి ఓటు హక్కుని కల్పించాలన్న భావనతోనే ప్రాతినిధ్యపాలనా పద్ధతి మొదలైంది. భారత రాజ్యాంగ పరిషత్తుకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో కూడా ఓటువేసే హక్కు ఆనాడు పన్నులు కట్టే వారికే దక్కింది. ఆనాటికి వాళ్ల సంఖ్య జనాభాలో 10 నుంచి 15 శాతం లోపే ఉంది.

ప్రపంచవ్యాప్తంగా ఇంత పరిమితంగా మొదలైన ప్రజాస్వామ్యం అనుకోని విధంగా అందరికీ ఓటుహక్కు కల్పించటానికి కారణమైంది. వ్యాపారవర్గం ఉద్దేశం ఒకటి, వివిధ పరిణామాల కలయికతో జరిగింది మరొకటి. పారిశ్రామిక విప్లవం మొదలైన తర్వాత ఫ్యాక్టరీలు పుట్టుకొచ్చి, వాటితో పాటు కార్మికులు పెరిగిన తర్వాత వాళ్ల పోరాటాలతో ఓటుహక్కుని విస్తరించక తప్పలేదు. స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాల కోసమూ, ఫొటోలను, సందేశాలను, వ్యక్తిగత వివరాలను పంచుకోటానికీ, ఆన్‌లైన్ ద్వారా అభిరుచుల కలబోతల కోసం మొదలైన సోషల్‌మీడియా... రాజకీయ బల సమీకరణలకూ, పౌరుల విస్తృత కార్యాచరణకూ, పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకూ వేదికై ప్రభుత్వాలను గద్దె దింపే స్థాయికి చేరుకుంటుందని ఒకప్పుడు ఊహించలేదు. అందుకే ప్రాచీన చరిత్రలోనైనా, ఆధునిక చరిత్రలోనైనా ఊహించని, ఉద్దేశించని ఫలితాలను విశ్లేషించటమే చాలా కీలకం.

# వికసిత్ భారత్ వైపు చేనేత అడుగులు

**కేవలం సాంకేతికతతోనే అభివృద్ధి చెందిన దేశ నిర్మాణం సాధ్యం కాదు. దాని బలాలను భవిష్యత్ వృద్ధికి చోదక శక్తులుగా మార్చే సామర్థ్యంపై రూపుదిద్దుకుంటుంది. భారతదేశం 'వికసిత భారత్ 2047' దిశగా పురోగమిస్తున్న తరుణంలో, మనం అత్యాధునిక సాంకేతికతలలో పెట్టుబడులు పెడుతున్నాం. తయారీ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ పరిశ్రమలను నిర్మిస్తున్నాం. అయితే, మన గొప్ప బలాలలో ఒకటైన మన చేనేత సంప్రదాయం మనతోనే ఉంది. ఆగస్టు 7న భారతదేశం 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, సుస్థిరతకు, ప్రామాణికతకు మరియు దృఢమైన సరఫరా వ్యవస్థలకు విలువిచ్చే ఈ ప్రపంచం కోసం చేనేతను ఒక వ్యూహాత్మక రంగంగా చూడాల్సిన సమయం ఆసన్నమైంది. మన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి 'వికసిత్ భారత్ 2047' దృక్పథం సమృద్ధి, స్వావలంబన, సమ్మిళితత్వం, సాంస్కృతిక విశ్వాసాలపై నిర్మించబడింది. చేనేత రంగం మన సంప్రదాయాన్ని, కొత్త ఆవిష్కరణలను ఒకచోటకు చేరుస్తుంది. అంతేకాకుండా మహిళల నేతృత్వంలో అభివృద్ధి, గ్రామీణ వ్యవస్థాపకత, జీవనోపాధి మరియు ప్రపంచ స్థాయి పోటీతత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా ఈ దృక్పథానికి ప్రతిరూపంగా నిలుస్తుంది.**





గిరిరాజ్ సింగ్
(రచయిత: కేంద్ర జౌళి శాఖ మంత్రి)
(ఇందులో వ్యక్తపరిచిన అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి)

రామచరిత మానస్లో చెప్పినట్లుగా:
"సౌరజ ధీరజ తెహి రథ చాకా। సత్య సీల దృఢ ధ్వజా పతాకా॥
బల బిబేక దమ పరహిత ఘోరే। ఛమా కృపా సమతా రజు జోరే॥"

విజయ రథం గురించి వివరిస్తూ శ్రీరాముడు, "శాశ్వత విజయం అనేది కేవలం అధికారంతో రాదు, అది నైతిక విలువలపైనే నిర్మించబడుతుంది" అని బోధిస్తాడు. ఆ విలువలనే శతాబ్దాలుగా భారతదేశ చేనేత సంప్రదాయాన్ని నిలబెట్టాయి. ప్రతి చేనేత వస్త్రం వెనుక సంప్రదాయాన్ని కాపాడే ధైర్యం, ప్రతి దారాన్ని సరిగ్గా కుదిర్చే ఓర్పు, ప్రామాణికమైన హస్తకళా నిబద్ధత మరియు తరతరాల జ్ఞానం ప్రతిబింబిస్తాయి. అందుకే చేనేత కేవలం ఒక కళ మాత్రమే కాదు, భారతదేశ నాగరికతకు ఉన్న అత్యంత గొప్ప బలాలలో ఒకటి.

మొట్టమొదట పత్తిని సాగు చేసి, నేసిన సింధు లోయ నాగరికత నుంచి, భారతీయ వస్త్రాలు ప్రపంచ వాణిజ్యంలో ఆధిపత్యం చెలాయించిన పద్దెనిమిదవ శతాబ్దం వరకు, భారతదేశం వస్త్ర రంగ నైపుణ్యంలో ప్రపంచ ప్రమాణాలను నెలకొల్పింది. ఒక ఉంగరం గుండా 25 మీటర్ల పొడవునా జాలువారేంత నాజూకైన బెంగాల్ ప్రఖ్యాత మస్లిన్, బనారసి పట్టు, కాంచీపురం నేతలు, పోచంపల్లి ఇక్కత్, లెక్కలేనన్ని ప్రాంతీయ సంప్రదాయాలు కలిసి భారతదేశానికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను సంపాదించిపెట్టాయి. నేడు, ప్రపంచం మళ్లీ ప్రామాణికమైన, సుస్థిరమైన, చేతితో తయారు చేసిన ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతోంది. ఆ నాయకత్వాన్ని మనం మళ్లీ సొంతం చేసుకోవడానికి ఇది ఒక చారిత్రాత్మక అవకాశం. మన తదుపరి చేనేత విప్లవం కేవలం వస్త్రాలను మాత్రమే కాకుండా మన కళను, సంస్కృతిని, నూతన ఆవిష్కరణలను మరియు నమ్మకాన్ని ఎగుమతి చేయాలి; తద్వారా ప్రతి చేనేత ఉత్పత్తిని 'బ్రాండ్ ఇండియా' రాయబారిగా మార్చాలి.

చేనేత పరిశ్రమ భారతదేశ అతిపెద్ద కుటీర పరిశ్రమ. ఇది 35 లక్షలకు పైగా నేత కార్మికులు, అనుబంధ కార్మికుల జీవనోపాధికి ఊతమిస్తోంది. వీరిలో దాదాపు 72 శాతం మంది మహిళలే ఉన్నారు. గత దశాబ్ద కాలంలో, ప్రభుత్వం ముడి పదార్థాల సరఫరా పథకం, 797 చేనేత క్లస్టర్లు, 1.24 లక్షలకు పైగా అధునిక మగ్గాలు, దాదాపు 97,000 మంది చేతి వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా ఈ రంగాన్ని బలోపేతం చేసింది. అలాగే.. ప్రొడ్యూసర్ కంపెనీలు, జీఐ ట్యాగ్ ఉన్న ఉత్పత్తులు, హ్యాండ్లూమ్ మార్క్, ఇండియా హ్యాండ్మేడ్ సర్టిఫికేషన్, అర్బన్ హాట్లు, డిజైన్ రిసోర్స్ సెంటర్ల వంటి కార్యక్రమాలతో ఈ రంగం బలోపేతమైంది.

నేడు, 29 నేత కార్మికుల సేవా కేంద్రాలు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, డిజైన్ అభివృద్ధి, ముడి పదార్థాల సహాయం, మార్కెట్ అనుసంధానాల ద్వారా పూర్తి స్థాయి మద్దతును అందిస్తున్నాయి. అలాగే, అధునాతన శిక్షణను అందించేందుకు మరియు ప్రత్యేకమైన, అధిక విలువ కలిగిన చేనేత ఉత్పత్తులను అభివృద్ధికి 11 ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థలను బలోపేతం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలు చేనేతను ఒక సంక్షేమ కార్యక్రమంగా చూడటం నుంచి ప్రపంచ స్థాయిలో పోటీపడే సృజనాత్మక పరిశ్రమగా మార్చే దిశగా వచ్చిన మార్పును సూచిస్తున్నాయి. రాబోయే జాతీయ చేనేత మరియు హస్తకళల కార్యక్రమం 500కు పైగా జిల్లాల్లోని 1,800 క్లస్టర్లను బలోపేతం చేస్తుంది. ఇది 65 లక్షల మంది నేత కార్మికులకు, చేతివృత్తిదారులకు లబ్ధి చేకూరుస్తుంది. 'హ్యాండ్మేడ్ ఇన్ ఇండియా'ను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బ్రాండ్గా నిలబెడుతుంది.

భారతదేశ చేనేత ప్రయాణంలో ఆవిష్కరణ ఎల్లప్పుడూ ఒక అంతర్భాగంగా ఉంది. మహాత్మా గాంధీ అంబర్ చరఖా మరింత సమర్థవంతంగా నూలు వడకడాన్ని సులభతరం, వేగవంతం చేసి స్వావలంబన లక్ష్యాన్ని ముందుకు నడిపించింది. ఇటీవలే, అస్సాంలోని మైనా మగ్గం మరియు శివసాగర్లో అభివృద్ధి చేసిన చిత్రరంజన్ చేనేత మగ్గం, మెరుగైన మగ్గం రూపకల్పన నేతను ఎంత సులభతరం, మరింత ఉత్పాదకంగా చేయగలదో చూపించాయి. ఈ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ సహకారంతో స్థాపించిన 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ', దివ్యాంగులతో సహా ఇతరుల కోసం శారీరక శ్రమను తగ్గించి, ఉత్పాదకతను మెరుగుపరిచే తేలికైన, బలమైన మరియు ఉపయోగించేందుకు సులభమైన మగ్గాలను అభివృద్ధి చేస్తోంది. ఈ కేంద్రం ఆధ్వర్యంలో, 'హ్యాండ్లూమ్ 4.0' కార్యక్రమం ఉత్పాదకత, నాణ్యత, నిర్వహణ పర్యవేక్షణకు డిజిటల్ సాధనాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ను ఉపయోగిస్తుంది. దీనిని రాష్ట్రాల వ్యాప్తంగా విస్తరించే ముందు 100 మగ్గాలతో పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నారు.

సాంకేతికత చేనేత కార్మికుడికి సాధికారత కల్పించాలి తప్పా, అతని స్థానాన్ని ఆక్రమించకూడదు. జియోఏఐ, ఎక్స్ వంటి వేదికలు డిమాండ్ను అంచనా వేయడానికి, డిజైన్ ట్రెండ్లను గుర్తించడానికి, అసలైన చేనేత ఉత్పత్తుల ప్రామాణికతను ధృవీకరించడానికి, నేత కార్మికులను నేరుగా ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించేందుకు సహాయపడతాయి.

అదే సమయంలో, ప్రీమియం పట్టు, సహజ దారాలు, సుస్థిర నారలు, వినూత్న మిశ్రమాలలోకి ఉత్పత్తులను విస్తరించి అధిక విలువ గల ఉత్పత్తులను సృష్టించి, కొత్త మార్కెట్ల అవకాశాలను అందుకోవచ్చు. మెరుగైన బ్రాండింగ్, విలువ జోడింపు, నేరుగా మార్కెట్ అందుబాటుతో ఈ ఆవిష్కరణలు నేత కార్మికుల ఆదాయాలను పెంచుతాయి. రాబోయే సంవత్సరాల్లో ప్రతి నేత కార్మికుడు నెలకు రూ.50,000 గౌరవప్రదమైన, ఆశాజనకమైన ఆదాయాన్ని పొందేలా చేయడమే మా లక్ష్యం.

చేనేత పరిశ్రమ భవిష్యత్తు చాలా వరకు మార్కెట్ల ఆలోచనా విధానం పై ఆధారపడి ఉంటుంది. మన నేత కార్మికులు కేవలం శ్రామికులు మాత్రమే కాదు. వారు పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, విలువ సృష్టికర్తలు. బ్రాండ్లను నిర్మించుకోవడానికి, విలువ శ్రేణిలో వృద్ధి చెందేందుకు, ప్రపంచ మార్కెట్లను చేరుకోవడానికి వారికి అవకాశం కల్పించి, మనం చేనేతను భారతదేశ అత్యంత చైతన్యవంతమైన సృజనాత్మక పరిశ్రమలలో ఒకటిగా మార్చవచ్చు. నేత తదుపరి అధ్యాయాన్ని తీర్చిదిద్దడానికి వారసత్వాన్నిసాంకేతికతను, సృజనాత్మకతనువ్యాపార నైపుణ్యాన్ని కలపాలని భారతీయ యువతకు ఇది ఒక పిలుపు.

ఈ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా, మన నేత కార్మికులను మన వారసత్వ సంరక్షకులుగా మాత్రమే కాకుండా, భారత ప్రగతికి రూపశిల్పులుగా కూడా గౌరవిద్దాం. చేనేతను మన దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుందాం. మనం కొనే, ధరించే ప్రతి చేనేత వస్తువు ఒక నేత కార్మికుని జీవనోపాధిని బలపరుస్తుంది. సంప్రదాయాన్ని పరిరక్షిస్తుంది. భారతదేశ గాథను ప్రపంచానికి చాటిచెబుతుంది. చేనేతను ఎంచుకోవడం ద్వారా, మనం మన వారసత్వాన్ని ధరించడమే కాదు వికసిత భారత్ భవిష్యత్తును నేయడంలో సహాయపడతాం.

# పల్లె బతుకుల్లో ఏదీ ప్రగతి?

**ప్రఖ్యాత ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ అభిప్రాయం ప్రకారం, పేదరికమంటే- మంచి జీవితాన్ని గడపగలిగిన సామర్థ్యానికి నోచుకోకపోవడం. ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలిగిన అవకాశానికి దూరం కావడం. ప్రగతి అంటేనేమో- వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సును హరించే ఆ దారిద్ర్యంలోంచి బయటపడగలిగిన సామర్థ్యాలను ప్రజలందరికీ సమకూర్చడం. ఆ మేరకు భారతావని నిజంగా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే- ఇప్పటికీ దాదాపు 65శాతం జనాభాకు ఆవాసాలైన పల్లెసీమలు సుభిక్షం కావాలి. ఆ గ్రామాల్లోని డెబ్బై శాతం కుటుంబాలకు జీవనాధారమైన వ్యవసాయంలో వృద్ధికి సమాంతరంగా సాగుదారుల ఆదాయాలు పెరగాలి. కానీ, దేశీయంగా సామాన్య రైతుల రాబడులు ఎన్నాళ్లుగానో నేలచూపులు చూస్తున్నాయి. యాభై శాతానికిపైగా వ్యవసాయ కుటుంబాలు అప్పుల విషవలయంలో చిక్కుకుని అల్లాడుతున్నాయి. మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలహీనం చేస్తున్న ఈ దురవస్థ- 'వికసిత్ భారత్' కలల సాకారానికి ప్రధాన అవరోధమవుతోంది. ఆర్బీఐ లోగడ స్పష్టీకరించినట్లుగా, వ్యవసాయ ఆదాయాలూ గ్రామీణ ఉపాధి అవకాశాలు మెరుగుపడితేనే దేశార్థిక వృద్ధి వేగవంతమవుతుంది!**



పల్లె భారతంలోని ఎక్కువ శాతం మంది బతుకుల్లో సుఖసంతోషాలు గగన కుసుమాలు అవుతున్నాయనే చేదునిజాన్ని 'నాబార్డ్' సర్వే తాజాగా మరోసారి వెలుగులోకి తెచ్చింది. కిందటి సంవత్సరంతో పోలిస్తే ఈ నెల ప్రథమార్థం నాటికి దాదాపు 20శాతం గ్రామీణ కుటుంబాల ఆదాయాలు పడిపోయాయని, మరో 52శాతానికి పైగా పల్లె పరివారాల సంపాదనలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయని ఆ నివేదిక వెల్లడించింది. ధరాభారాలతో ఖర్చులు పెరిగి చేతిలో మిగిలే డబ్బు తగ్గిపోతుండటంతో పొదుపు మొత్తాలు తరిగిపోతున్నాయి. రుణభారాలు అధికమవుతున్నాయి. ఆదాయాలు ఇలా బక్కచిక్కిపోతున్న కొద్దీ విద్య, వైద్యం తదితరాలపై కుటుంబాల వ్యయం అడుగంటిపోతుంది. పేదరికం పడగవిప్పి మానవాభివృద్ధిని దిగమింగుతుంది. పల్లె ప్రజల రాబడులు పెరగకపోతే వస్తుసేవలకు గిరాకీ తెగ్గోసుకుపోతుంది. అది మరిన్ని రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మన జీడీపీలో దాదాపు అరవైశాతం వాటా ప్రైవేట్ వినియోగ వ్యయానిదే. దాన్ని పరిమితం చేసే గ్రామీణార్థిక సంక్షోభం తీవ్రతరమయ్యే కొద్దీ ప్రగతి లక్ష్యాల సాధనలో దేశం వెనకబడిపోతుంది. ఆదాయ అసమానతలను పెంచిపోషించే అవ్యవస్థ అంతిమంగా సామాజిక అశాంతికి దారితీస్తుంది!

నేషనల్ శాంపిల్ సర్వే సమాచారం ప్రకారం, 2018 19లో రైతు కుటుంబాల నెలవారీ సంపాదన సగటున రూ.10,218 మాత్రమే! 202425 నాటికి అది రూ.19,696కు పెరిగి ఉండొచ్చునని ఐసీఆర్ఐఈఆర్ విధానపత్రం ఇటీవల నివేదించింది. ఈ అరకొర ఆదాయాలతో సంసార సాగరాన్ని ఈదడం ఎలా సాధ్యం? స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా గిట్టుబాటు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించడంలో సర్కారీవర్గాల ఉదాసీనత రైతాంగానికి అశనిపాతమవుతోంది. దిగుబడులు బాగా వచ్చినప్పటికీ కష్టానికి తగిన ప్రతిఫలాన్ని అందుకోవడంలో అన్నదాతల అశక్తతకు అదే కారణమవుతోంది. తరచూ దండెత్తుతున్న ప్రకృతి విపత్తులు ఒకవైపు కర్షకులను కన్నీళ్లలో ముంచేస్తుంటే నిల్వ సదుపాయాల కొరత, మార్కెట్ మోసాలు వంటివి సాగుదారులను మరింతగా కుంగదీస్తున్నాయి. రైతులోకానికి ప్రభుత్వాలు నిజంగా లబ్ధి చేకూర్చాలంటే ఇలాంటి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంపై శ్రద్ధ వహించాలి. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుతో గ్రామీణ యువతకు ఉపాధి మార్గాలను విస్తరించి, వలసపోవాల్సిన అగత్యాన్ని వారికి తప్పించాలి!

# రహదారులపై ఆగని నరమేధం!

**జాతీయ రహదారుల విస్తరణతో పాటు ఇప్పుడు ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణమూ చురుగ్గా సాగుతోంది. ఇదే సమయంలో రోడ్డు ప్రమాదాలు ఏడాదికేడాది పెరుగుతుండటం కలవరపరుస్తోంది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ తాజా లెక్కల ప్రకారం నిరుడు రహదారి దుర్ఘటనలు దేశవ్యాప్తంగా 1.83 లక్షల మందిని కబళించాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే మరణాలు మూడున్నర శాతం అధికమయ్యాయి. కిందటేడాదిలో రోడ్డు ప్రమాదాలు ఉత్తర్ ప్రదేశ్‌లో అత్యధికంగా 27,550 మందిని బలిగొంటే- ఏపీలో 8,327 మందిని, తెలంగాణలో 7,566 మందిని పొట్టనపెట్టుకున్నాయి. గడచిన రెండు దశాబ్దాల్లో యాక్సిడెంట్లు దాదాపు పదిశాతం పెరిగితే, వాటిలో మరణాలు మాత్రం 80శాతం మేర అధికమయ్యాయి. ఒకే ప్రమాదంలో ఎక్కువ మంది విగతజీవులవుతున్న దయనీయావస్థకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. మృతుల్లో అరవై శాతానికి పైగా 18-45 ఏళ్లలోపువారు ఉంటుండటంతో దేశం విలువైన మానవ వనరులను కోల్పోతోంది. మొత్తం రహదారి వ్యవస్థలో నేషనల్ హైవేల వాటా రెండు శాతమే అయినా, మూడోవంతు ప్రమాద మరణాలు వాటిపైనే సంభవిస్తున్నాయి. ఏతావాతా రోడ్లపై పారుతున్న నెత్తుటేళ్లు ఎన్నో కుటుంబాలను ఆర్థిక అగచాట్లలో ముంచేస్తున్నాయి. జనభారత ప్రగతి స్వప్నాలనూ అవి ఛిద్రం చేస్తున్నాయి!**

దేశీయంగా డ్రైవింగ్ లైసెన్సుల మంజూరులో లోపాల కారణంగా సరైన నైపుణ్యాలు లేకుండానే చాలామంది బండ్లు తీసుకుని రోడ్డెక్కగలుగుతున్నారు. ఇలాంటి వారు వాహనాలను ఇష్టారీతిగా దౌడు తీయించి మృత్యువాత పడుతున్నారు. సాటివారి ఉసురూ తీస్తున్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి స్టీరింగ్ పట్టుకోవడం, రాంగ్‌రూట్‌లో రావడం, చోదకుల నిద్రమత్తు లాంటివన్నీ రోడ్లపై మృత్యుదేవత స్వైరవిహారాన్ని నిత్యకృత్యంగా మారుస్తున్నాయి. ఇంకోపక్క రహదారి ప్రణాళికల్లో లొసుగులు, తప్పుల తడకలుగా రూపొందుతున్న సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, చట్టాల అమలులో అసమర్థ నిర్వాకాలు వంటి వ్యవస్థాగత వైఫల్యాలూ రోడ్డుపైకి వెళ్లినవారు క్షేమంగా తిరిగొస్తారన్న నమ్మకం లేకుండా చేస్తున్నాయి. అధికారిక వివరాల మేరకు జాతీయ రహదారులపై 16వేలకు పైగా బ్లాక్‌స్పాట్లను (ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను) గుర్తించారు. వాటిలో సగానికన్నా తక్కువచోట్లే జంక్షన్ల బాగుసేత, అండర్‌పాస్‌ల నిర్మాణం తదితర శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టారు. ఇలా ఎక్కడికక్కడ రహదారి భద్రత నీరుగారిపోతుండటంతో ఇండియా ఏటా తన జీడీపీలో మూడు శాతాన్ని కోల్పోవాల్సి వస్తోంది!

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, గడచిన పుష్కరకాలంలో ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు అయిదు శాతం మేర తగ్గాయి. ఇండియాలో మాత్రం అవి 15శాతం పెరిగాయి. ప్రభుత్వాల ఉదాసీనతే మన రోడ్లను ఇంతగా రక్తసిక్తం చేస్తోంది. దాన్ని నివారించాలంటే డ్రైవింగ్ లైసెన్సుల వ్యవస్థను లోపరహితం చేయాలి. ఎక్కడికక్కడ కెమెరాలు, వేగాన్ని కొలిచే పరికరాలను ఏర్పాటుచేసి నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారికి భారీగా జరిమానాలు విధించాలి. నియమాలను పదేపదే తుంగలో తొక్కుతున్న వారి లైసెన్సులను శాశ్వతంగా రద్దుచేయాలి.

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం | 02.08.2026 | 01

# నేడు స్వాతంత్ర్య సమరయోధుల వర్ధంతి ని జయప్రదం చేయండి



**యాడికి, ఆగష్టు 6 ,అనంత జనశక్తి న్యూస్ :**

స్వాతంత్ర్య సమరయోధులు వి.కె. ఆదినారాయణ రెడ్డి, పెద్దకోట్ల నారాయణస్వామి వర్ధంతిని శుక్రవారం జయప్రదం చేయాలని గురువారం యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ తెలిపారు.మండల కేంద్రంలో గురువారం సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డుతో సత్కరించినందుకు యాడికి మండలం తరపున ఘనంగా సన్మానించాలని నిర్ణయించారన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వాతంత్ర్య సమరయోధుడు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంట నుండి సిపిఐ పార్టీ కార్యక్రమాలు ఉంటాయని, సిపిఐ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం, గాంధీ విగ్రహం వద్ద జీపు జాత కార్యక్రమం ద్వారా బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.యాడికి మండల ప్రజలు, అధికారులు, సానుభూతిపరులకు, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరు , రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరారు. ఈయనతో పాటు కొట్టాలపల్లి ఆదినారాయణ రెడ్డి, చీమల వాగుపల్లి శ్రీరాములు పాల్గొన్నారు.

# రోడ్డు దిగ్బంధనంతో వాహనదారులకు నిత్య నరకం





**- ఆర్డీటీ కార్యాలయం సమీపంలో యూ-టర్న్ పునరుద్ధరించాలి**

**అనంతపురం ఆగస్టు 06, అనంత జనశక్తి న్యూస్**

స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయం సమీపంలోని ధర్మవరం రహదారిపై ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు, అనవసర బ్యారికేడ్లు, స్పీడ్ బ్రేకర్ల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యూటర్న్ మార్గాన్ని పూర్తిగా మూసివేయడంతో విజయనగర్ కాలనీ, సమీపంలోని పెట్రోల్ బంకులకు వెళ్లే వాహనాలు దూరం తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ కారణంగా పలువురు వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు శివకోటి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన అనవసర బ్యారికేడ్లు కూడా ట్రాఫిక్‌కు ఆటంకంగా మారి నిత్యం రద్దీ, ప్రమాదాలకు కారణమవుతున్నాయి.నగరంలో కేవలం రెండు సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్లు మాత్రమే ఉండగా, వాటిలో ఒకటి విజయనగర్ కాలనీ సమీపంలో ఉండటంతో బత్తలపల్లి, ధర్మవరం, కదిరి, రాప్తాడు ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలు, అంబులెన్సులు, ఇతర వాహనాలు తప్పనిసరిగా ఈ మార్గాన్నే వినియోగిస్తున్నాయి.యూటర్న్ లేకపోవడం వల్ల అవి రాంగ్‌రూట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది. అదనంగా, రాత్రి సమయంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద తగిన లైటింగ్ లేకపోవడం, రేడియం హెచ్చరిక బోర్డులు, కాషన్ మార్కింగ్‌లు లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అందువల్ల ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని:** యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలను వెంటనే తొలగించి మార్గాన్ని పునరుద్ధరించాలి. అవసరం లేని బ్యారికేడ్లను తొలగించాలి.ఇరువైపులా శాస్త్రీయ ప్రమాణాలతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.రేడియం హెచ్చరిక గుర్తులు, కాషన్ బోర్డులు, తగిన వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రి సమయంలోనూ సురక్షిత ప్రయాణానికి చర్యలు తీసుకోవాలి.ప్రజల సౌకర్యం, రహదారి భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిర్వాసితుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. ఎం. సురేష్ బాబు, కార్యదర్శి బాయినేని నాగేంద్ర ప్రసాద్, ప్రొ. వెంకట శివారెడ్డి తదితరులు కోరారు.

# గర్భవతులలో అధిక ప్రమాద పరిస్థితులను గుర్తించండి



**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పైరోజా బేగం...**

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 06 అనంత జన శక్తి న్యూస్.**

శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజాబేగం అధ్యక్షతన, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఆర్మాన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ చరణ్ తేజ్ నిర్వహణ అధికారిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ భవనంలో అధిక ప్రమాద గర్భధారణ గుర్తింపు, నిర్వహణపై పుట్టపర్తి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్త్రీ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం డా. కె. గాయత్రి డా. దీప్తి రెడ్డి , ఆధ్వర్యంలో పుట్టపర్తి డివిజన్‌లోని ఏఎన్ఎం లకు ఓలో అంశాలపై సూచనలు ఇచ్చారు. అధిక ప్రమాద గర్భధారణ, కేసులను ఎలా గుర్తించాలి, ఫీల్డ్ స్థాయిలో ఎలా నిర్వహించాలనే అంశాలపై శిక్షణ అందించారు. ఈ శిక్షణలో గర్భధారణ ప్రారంభ దశలో ప్రాథమిక చరిత్ర సేకరణ గర్భిణీ మహిళల నమోదు , రక్తహీనత , గర్భధారణలో అధిక రక్తపోటు , గర్భధారణలో మధుమేహం, ప్రసవానికి ముందు రక్తస్రావం , మూర్ఛ వ్యాధి గర్భధారణలో క్షయవ్యాధి,గర్భధారణలో జ్వరం గతంలో సిజేరియన్ ప్రసవం జరిగిన చరిత్ర గర్భధారణలో గుండె సంబంధిత వ్యాధులు,తదితర అంశాలపై మొదటి రోజు శిక్షణ ఇవ్వడం జరిగినది. మిగిలిన అంశాలపై రెండవ రోజు 7న శిక్షణ ఇవ్వనున్నామని శిక్షణ అనంతరం అన్ని ఏఎన్ఎం లకు ప్రీటెస్ట్, పోస్ట్‌టెస్ట్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సునీల్ పద్మజ డి పి ఎం నాగరాజు,డి పి హెచ్ ఎన్ ఓ వీరమ్మ,సి హెచ్ ఓ వన్నప్ప పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పరిటాల శ్రీరామ్ పర్యటన

**- సానేవారిపల్లిలో ఇంటింటికీ పర్యటన....**

**- ప్రజల సమస్యలపై అధికారులతో వెంటనే సమీక్ష...**

**ధర్మవరం /ముదిగుబ్బ**

**ఆగష్టు 6 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నియోజకవర్గంలో ప్రజా సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారం చూపే లక్ష్యంతో టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ముదిగుబ్బ మండలం సానేవారిపల్లి గ్రామంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటిని



సందర్శించిన శ్రీరామ్, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై వెంటనే సచివాలయ సిబ్బందితో మాట్లాడి పరిష్కారం చూపాలని సూచించారు.

గ్రామంలో ఉన్న భూ సమస్యలు, రహదారి సమస్యలు, మైనార్టీల కబరస్తాన్‌కు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీసీ కాలనీలో ఇళ్ల పట్టాల మంజూరుకు గ్రామస్థులు విజ్ఞప్తి చేయగా, తహసీల్దార్, ఎంపీడీఓతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్దిష్ట గడువులో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆశా వర్కర్లు తమ సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకురాగా, వాటిని ఓపిగ్గా విన్న ఆయన, ఈ అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం మద్దన్నగారిపల్లి సమీపంలోని హంద్రీ-నీవా కాలువను పరిశీలించిన శ్రీరామ్, గతంలో ప్రతిపాదించిన విధంగా ఐదు చెరువులకు నీరందించే ప్రణాళికపై హంద్రీ-నీవా అధికారులతో చర్చించారు. రైతులకు సాగునీటి సమస్య తీరేలా ఈ ప్రతిపాదనను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. రానున్న మూడేళ్లలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడంతో పాటు, సాగు నీరు, తాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జె.సి అస్మిత్ రెడ్డి



**యాడికి, ఆగష్టు 6, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి గురువారం పరిశీలించారు. సంత మార్కెట్లో నిర్మిస్తున్న అధునాతన కళ్యాణ మండపం, సోమవారం జరిగే సంతను కుంటలోకి మారుస్తున్న సందర్భంగా అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి తనిఖీ చేశారు. మండల తెలుగుదేశం నాయకులు, అధికారులతో కలిసి వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పనులను చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, జెసి అభిమానులు ,మండల అధికారులు పాల్గొన్నారు.

# అనంతగిరి గిరిజన సమస్యలు మంగళగిరి జనవాణిలో ప్రతిధ్వని

**- తాగునీరు–రహదారిపై వినతిపత్రాలు...వెంటనే చర్యలు తీసుకోవాలని జనసేన డిమాండ్.**

**అనంతగిరి,అనంత జన శక్తీ న్యూస్ ఆగష్టు 6:**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాలు ఎదుర్కొంటున్న తాగునీటి కొరత,రహదారి సౌకర్యాల లేమి వంటి ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు చిట్టం మురళి మంగళగిరిలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో వినతిపత్రాలు సమర్పించారు. గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమగ్రంగా వివరిస్తూ, అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా విశాఖపట్నం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, ఉత్తరాంధ్ర మహిళా రీజినల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీకు వినతిపత్రాలను అందజేశారు. కివర్ల పంచాయతీ జాలడ గ్రామంలో జల్ జీవన్ మిషన్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, కోట్ల రూపాయలతో ప్రారంభించిన తాగునీటి పథకం ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం ఆందోళనకరమని తెలిపారు. దీంతో గ్రామస్తులు దూర



ప్రాంతాల నుంచి నీటిని మోసుకురావాల్సిన పరిస్థితి కొనసాగుతోందని, నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసి శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే పినకోట పంచాయతీ పరిధిలోని వీరభద్రపురం గ్రామం నుంచి జీనబాడు పంచాయతీ పరిధిలోని వలసల గరువు గ్రామం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల రహదారి నిర్మాణం అత్యవసరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం రహదారి లేకపోవడంతో గిరిజనులు రైవాడ రిజర్వాయర్‌ను చిన్న పడవల ద్వారా దాటి ప్రయాణించాల్సి వస్తోందని, ఇది ప్రతి రోజు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్టేనని ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో పడవ ప్రమాదాల్లో పలువురు గిరిజనులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను గుర్తుచేస్తూ, గర్భిణులు, విద్యార్థులు, వృద్ధులు, రైతులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో గ్రామాలు పూర్తిగా ఒంటరిగా మారిపోతున్నాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి వెంటనే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్‌ను కోరినట్లు చిట్టం మురళి తెలిపారు. ఈ రహదారి పూర్తయితే విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా గ్రామాలకు సకాలంలో చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

వినతిపత్రాలను స్వీకరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ సమస్యల తీవ్రతను గుర్తించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చిట్టం మురళి తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఈ సందర్భంగా చిట్టం మురళి మాట్లాడుతూ, జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుందని, అనంతగిరి మండలంలోని ప్రతి గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అనంతగిరి మండల కార్యదర్శి పాంగి లక్ష్మణ్ పాల్గొని వినతిపత్రాల సమర్పణలో సహకరించారు.

# డిఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

**- రిలే, నిరాహార దీక్ష చేపట్టిన వైకాపా**

**- దీక్షను భగ్నం చేసిన పోలీసులు**

**యాడికి, ఆగష్టు 6, అనంత జనశక్తి న్యూస్ :**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు .వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ,కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు... యాడికి పట్టణంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షను కార్యక్రమం ను గురువారం ప్రారంభించారు. కొద్ది సేపటికే పోలీసులు దీక్షా ప్రాంగణానికి చేరుకుని నాయకులు, కార్యకర్తలను బలవంతంగా పార్టీ కార్యాలయానికి తరలించి దీక్షను భగ్నం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వెంటనే యాడికి పార్టీ కార్యాలయానికి చేరుకుని నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పడంతో పాటు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంజీవరాయుడు, మాజీ జడ్పిటిసి వెంకట్రామిరెడ్డి,సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, బ్రహ్మానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నూతన జిల్లా విద్యాశాఖ అధికారికి యూటీఎఫ్ శుభాకాంక్షలు.



**- ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం**

**అనంతగిరి, అనంత జన శక్తి న్యూస్,ఆగష్టు 6:**

**అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ భానుమూర్తి రాజు గారిని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.**

**ఈ సందర్భంగా జిల్లాలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు టి. చిట్టిబాబు, జిల్లా అధ్యక్షుడు కే. రఘునాథ్, ప్రధాన కార్యదర్శి వి. మహేశ్వరరావు,జిల్లా కార్యదర్శులు ఎస్.కన్నయ్య, ఈ. దేవుడు,ఎల్.నారాయణ పాల్గొన్నారు.**

- నేతన్న కుటుంబాలకు ఆర్థిక భద్రత.... చేనేత రంగానికి కొత్త భరోసా..!
- చేనేత కేవలం వృత్తి కాదు... భారతీయ సంస్కృతిని నూలుపోగుల్లో అల్లిన జీవన గాథ.
- చేనేతల చెమట చుక్కలే దేశ ఆర్థిక వ్యవస్థకు రంగులద్దె నిజమైన సంపద.
- మగ్గం మోగితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి వస్తుంది.
- నేతన్న నవ్వితేనే చేనేత కళ చిరస్థాయిగా వెలుగొందుతుంది.
- చేనేతలను ప్రోత్సహించడం అంటే వేలాది కుటుంబాలకు అండగా నిలబడటం.
- అగ్గిపెట్టెలో ఒదిగేలా పట్టుచీరలను తయారు చేయడం నైపుణ్యం మన నేతన్నల సొంతం.
- సృజనాత్మకత లోను నిత్యం కృషివలుడు.
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అనంత జనశక్తి ప్రత్యేక కథనం.

# చంద్రన్న.... చేనేతల భరోసా...!!



-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా నేతన్న సేవలో ( నేతన్నకు భరోసా) పథకాన్ని ప్రారంభిస్తుంది. దీని ద్వారా అర్హులైన చేనేత కార్మికుల ఖాతాల్లోకి నేరుగా 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం జమ చేయనుంది. అలాగే నేతన్న మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. సబ్సిడీల రూపంలో చేనేత క్లస్టర్ ద్వారా మగ్గాలు, పనిముట్లు 90% రాయితీ అందజేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 71,536 కుటుంబాలకు అర్హులైన చేనేత మగ్గమున్న కుటుంబ పెద్ద కు ఏటా 25 వేల రూపాయలు అందిస్తున్నారు.



శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,
ఆగస్టు 6, అనంత జనశక్తి న్యూస్:

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని 71,536 చేనేత కుటుంబాలకు "చేనేత భరోసా" పథకం కింద ఆర్థిక సాయం అందజేసింది. చేనేత కార్మికుల జీవనోపాధి కి భరోసా కల్పిస్తూ, సంప్రదాయ చేనేత పరిశ్రమకు నూతన ఊపిరి పోసే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. తరతరాలుగా వారసత్వంగా కొనసాగుతున్న ఈ కళను పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చేనేత కుటుంబాల్లో నూతన ఆశలను నింపుతున్నాయి. "చేనేత భరోసా" ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం వల్ల నేసే కుటుంబాలకు ఉపశమనం లభించడంతో పాటు, వారి ఆర్థిక స్థిరత్వం మరింత బలోపేతం కానుంది.చేనేత రంగాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తూనే, సంప్రదాయ నైపుణ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి విస్తరణ, మార్కెటింగ్ సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. "చేనేత బతికితేనే మన సంస్కృతి బతుకుతుంది... నేసే చేతికి భరోసా కల్పిస్తేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది" అనే సందేశాన్ని ఈ జాతీయ చేనేత దినోత్సవం మరోసారి చాటిచెప్పింది.

**చంద్రన్న... చేనేతలకు భరోసా..!**

నేత కుటుంబాలకు ఆర్థిక భద్రత... చేనేత రంగానికి కొత్త ఊపిరి. చేనేత అనేది కేవలం ఒక వృత్తి కాదు... అది తెలుగు నేల సంస్కృతికి ప్రతీక. కాలం మారినా, యంత్రాల పోటీ పెరిగినా మెసేజ్ చేతుల విలువ తగ్గలేదు. అయితే ఎన్నో ఏళ్లుగా ఆర్థిక ఇబ్బందులు, ముడిసరుకు ధరల పెరుగుదల, గిట్టుబాటు ధరల కొరతతో చేనేత కుటుంబాలు తీవ్ర ఒడిదదుగులను ఎదుర్కొన్నాయి. ఇలాంటి సమయంలో చంద్రన్న చేనేత భరోసా పథకం నేత కుటుంబాలకు ఆర్థిక అండగా నిలుస్తోంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వేలాది చేనేత కుటుంబాలకు అందించిన ఆర్థిక సహాయం కేవలం నగదు బదిలీ మాత్రమే కాదు... వారి శ్రమకు లభించిన గుర్తింపు, వారి భవిష్యత్తుపై వ్యక్తమైన నమ్మకం. చేనేతను కాపాడటం అంటే ఒక వృత్తిని మాత్రమే కాదు... వేలాది కుటుంబాల జీవనాధారాన్ని తెలుగు సాంప్రదాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కాపాడటమే. అందుకే నేతన్న చేతికి అందే ప్రతి రూపాయి అతని కుటుంబానికి భరోసా మాత్రమే కాదు చేనేత రంగానికి కొత్త ఊపిరి. అయితే ఆర్థిక సహాయంతోనే బాధ్యత పూర్తి కాదు. చేనేత వస్త్రాలకు విస్తృత మార్కెట్, గిట్టుబాటు ధర, ముడి సరుకు సబ్సిడీ, ఆధునిక డిజైన్లు, డిజిటల్ మార్కెటింగ్, ఎగుమతుల ప్రోత్సాహం వంటి చర్యలు సమాంతరంగా కొనసాగించినప్పుడే ఈ రంగం శాశ్వత బలోపేతం అవుతుంది."నేతన్న నవ్వితేనే చేనేత బతుకుతుంది... చేనేత బతికితేనే మన సంస్కృతి నిలుస్తుంది."ఈ ఆలోచనతో సంక్షేమం, అభివృద్ధి రెండూ కలసి నడిచినప్పుడే చేనేత రంగం మరింత బలపడుతుంది. ఆర్థిక భరోసాతో పాటు ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రతి అడుగు నేత కుటుంబాల భవిష్యత్తును మరింత వెలుగులోకి తీసుకువస్తుంది.

**సృజనాత్మకతలో నేతన్న... నిత్యం కృషివలుడు.**

నేతన్న చేతిలోని ప్రతి నూలుపోగు ఒక కళ. ప్రతి అల్లికలు ఒక ఆలోచన. ప్రతి వస్త్రంలో ఒక కళాఖండం దాగి ఉంటుంది. సృజనాత్మకతను శ్రమతో మేలవించి సాధారణ నూలు అసాధారణ వస్త్రంగా మలచడం మన నేతన్నల ప్రత్యేకత. ఉదయం నుంచి సాయంత్రం వరకు మగ్గం ముందు కూర్చుని ఓర్పుతో, ఏకాగ్రతతో శ్రమించే నేతన్న నిజమైన కృషివలుడు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త రంగులు, కొత్త డిజైన్లు, వినూత్న నమూనాలను సృష్టిస్తూ చేనేతలకు సరికొత్త గుర్తింపును తీసుకువస్తున్నాడు. సాంప్రదాయాన్ని కాపాడుతూనే ఆధునికతను అల్లగల సృజనాత్మక శక్తి ఆయన సొంతం. చేనేత వస్త్రం కేవలం దుస్తులు కాదు... అది నేతన్న చెమటతో అల్లిన గౌరవం, కుటుంబ జీవనానికి ఆధారం, తెలుగు సంస్కృతికి ప్రతిబింబం. ప్రతి చీర వెనుక ఎన్నో గంటల శ్రమ, ఎన్నో సంవత్సరాల అనుభవం, అపారమైన కళాత్మకత దాగి ఉంటుంది. సృజనాత్మకతకు చిరునామా నేతన్న... కష్టానికి ప్రతిరూపం నేతన్న... మగ్గం చప్పుడే అతని సంగీతం, నూలు పోగే అతని కలం, చేనేతే అతని జీవిత గీతం. అలాంటి కళాకారుడిని ఆదరించండం అంటే మన సంస్కృతిని మన వారసత్వాన్ని మన కళను గౌరవించినట్టే.

**చేనేతను ప్రోత్సహిద్దాం... వేలాది కుటుంబాలకు అండగా నిలుద్దాం.**

చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అనేది కేవలం ఒక దుస్తులను కొనడం కాదు... ఒక నేత కుటుంబం ముఖములో చిరునవ్వును కొనడం. ప్రతి చేనేత చీర వెనుక ఒక కుటుంబం జీవనం, ఒక కళాకారుడి శ్రమ, ఒక సాంప్రదాయ, ఒక సంస్కృతి దాగి ఉంటుంది. యంత్రాలతో తయారయ్యే వస్త్రాల పోటీలో చేనేత రంగం ఎన్నో సవాలను ఎదుర్కొంటోంది. అయినప్పటికీ మన నేతన్నలు తమ కళను, సాంప్రదాయాన్ని వదలకుండా మగ్గం చప్పుడుతో జీవన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. అలాంటి కళాకారులకు నిజమైన బలం ప్రభుత్వ పథకాలతో పాటు ప్రజల ఆదరణ కూడా కావాలి. చేనేతను ప్రోత్సహించడం అంటే ఒక నేతన్నను ఆదుకోవడం కాదు... వేలాది కుటుంబాల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం. ప్రతి ఇంట్లో ఒక చేనేత వస్త్రానికి చోటు కల్పిస్తే వేలాది మగ్గాలు మళ్ళీ మోగుతాయి. ప్రతి చేనేత కొనుగోలు వెనుక ఒక కుటుంబానికి ఉపాధి, ఒక కళాకారుడి ఆత్మవిశ్వాసం, సాంప్రదాయానికి కొత్త జీవం లభిస్తుంది. చేనేతను ఆదరించడం ఒక ఎంపిక కాదు... మన సంస్కృతిని కాపాడే సామాజిక బాధ్యత. నేతన్న చెమటకు విలువనిచ్చినప్పుడే చేనేతకు వెలుగు వచ్చినప్పుడు వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగు నిండుతాయి.

**చేనేత చెమట చుక్కలే దేశ ఆర్థిక వ్యవస్థకు రంగుల అద్దె నిజమైన సంపద.**

చేనేత మగ్గం నుంచి జారే ప్రతి నూలుపోగు వెనుక ఒక కుటుంబం ఆశ ఉంటుంది. నేతన్న నుదుటి నుంచి జారే ప్రతి చెమట చుక్క వెనుక ఒక జీవన పోరాటం ఉంటుంది. ఆ శ్రమతోనే రంగుల చీరలు పుడతాయి... ఆ చీరలతోనే భారతీయ సంస్కృతి ప్రపంచ వేదికపై రెపరెపలాడుతుంది. చేనేత కార్మికుడు కేవలం వస్త్రాన్ని నేయడు... దేశ ఆర్థిక వ్యవస్థకు విలువను జోడిస్తాడు. గ్రామీణ ఉపాధికి బలం చేకూరుస్తాడు. సాంప్రదాయ కళను తరతరాలకు అందిస్తూ, స్వదేశీ ఉత్పత్తులకు గౌరవాన్ని పెంచుతాడు. అందుకే చేనేతల చెమట చుక్కలు నిజమైన జాతీయ సంపద. ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అంటే ఒక కళాకారుడు శ్రమకు గౌరవం ఇవ్వడం. ఒక కుటుంబానికి జీవనాధారాన్ని కల్పించడం. ఒక సాంప్రదాయాన్ని జీవంగా ఉంచడం. చేనేత రంగం బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశ ప్రగతికి మరింత బలమైన పునాది ఏర్పడుతుంది. చేనేతను ఆదరించడం దేశభక్తికి ప్రతీక. నేతన్న చెమట కు విలువ ఇవ్వడం సామాజిక బాధ్యత. మగ్గం చప్పుడు ఆగిపోకుండా కాపాడటం అంటే మన సంస్కృతిని, మన ఆర్థిక వ్యవస్థను మన వారసత్వాన్ని కాపాడటమే. నేతన్న చెమట చుక్కలు కేవలం నూలును తడపవు... దేశ ఆర్థిక వ్యవస్థకు రంగులు అద్దుతాయి. అలాంటి బంగారు చేతులను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత.

**జాతీయ చేనేత దినోత్సవం... నేతన్నలపై బాధ్యతలు పెంచే పండుగ.**

జాతీయ చేనేత దినోత్సవం అనేది కేవలం ఒక అధికారిక వేడుక మాత్రమే కాదు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయం, స్వవలంబనకు ప్రత్యేకగా నిలిచిన చేనేత రంగానికి నివాళి అర్పించే విశిష్టమైన రోజు. ప్రతి ఇంట్లో చేనేత వస్త్రాల వినియోగం పెరిగితేనే నేతన్న కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి. అందుకే ఈ దినోత్సవం ప్రతి ఒక్కరిలో చేనేతపై గౌరవాన్ని, నేతన్నల పట్ల బాధ్యతలను పెంపొందించే ప్రజా పండుగగా నిలవాలి. నేతన్న నేసే ప్రతి నూలు పోగులో అతని శ్రమ, కుటుంబ ఆశ, జీవన పోరాటం దాగి ఉంటుంది. యంత్రాల పోటీ, మారుతున్న ఫ్యాషన్ ధోరణులు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు మధ్య కూడా చేనేత కళను సజీవంగా ఉంచుతున్న చేనేతలు నిజమైన సంపద సృష్టికర్తలు. వారి చెమట చుక్కలే దేశ ఆర్థిక వ్యవస్థకు రంగులు అద్దుతున్నాయి. చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అనేది ఒక బట్టను కొనడం మాత్రమే కాదు.. ఒక కుటుంబ జీవనోపాధికి చేయూత ఇవ్వడం. భారతీయ వారసత్వాన్ని భావితరాలకు అందించడం. ఈ అవగాహన ప్రతి పౌరుడిలో పెరిగినప్పుడే జాతీయ చేనేత దినోత్సవం లక్ష్యం నెరవేరినట్లు అవుతుంది. ప్రభుత్వాలు సంక్షేమ పథకాల ద్వారా చేనేత రంగానికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతుందో, సమాజం కూడా చేనేత ఉత్పత్తులను ఆదరించడం ద్వారా తన బాధ్యతలను నిర్వర్తించాలి. "వోకల్ ఫర్ లోకల్" స్ఫూర్తితో చేనేతకు ప్రాధాన్యం ఇస్తే నేతన్నల జీవితాల్లో నిజమైన మార్పు సాధ్యమవుతుంది. జాతీయ చేనేత దినోత్సవం మనకు గుర్తు చేసేది ఒక్కటే... చేనేతను కాపాడితేనే సాంప్రదాయాన్ని కాపాడినట్టే. నేతన్నను ఆదరిస్తేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. చేనేతపై గౌరవం, నేతన్నలపై బాధ్యత ప్రతి భారతీయుడి జీవన విధానంలో భాగమైతేనే ఈ పండుగకు నిజమైన సార్ధకత లభిస్తుంది.



## అగ్గిపెట్టెలో ఒదిగే పట్టుచీరతో... అద్భుత నైపుణ్యం.




చేనేత అనేది కేవలం నూలు కాదు... అది కళ, ఓర్పు, అంకిత భావం, తరతరాలుగా సంక్రమించిన అపురూప నైపుణ్యం, ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే అద్భుతాలను సృష్టించడం మన నేతన్నల చేతివాటం. అందులో అగ్గిపెట్టెలో ఒదిగే అంతా సన్నని పట్టుచీరలను తయారు చేయడం వారి అసాధారణ ప్రతిభకు నిదర్శనం. ఒక్కో నూలు పోగు ను అపారమైన శ్రద్ధతో అల్లుతూ, సున్నితమైన నేతతో బరువు తెలియనంత తేలికగా అగ్గిపెట్టెలో సైతం ఒదిగిపోయే పట్టుచీరను రూపొందించడం సాధారణ విషయం కాదు. ఇది యంత్రాలతో సాధ్యం కానీ చేతి మేధస్సు, అనుభవం, ఓర్పు కలిసిన అద్భుత కళాఖండం. ఈ అరుదైన కళ ప్రపంచవ్యాప్తంగా జాతీయ చేనేత వైభవాన్ని చాటుతోంది. విదేశీ మార్కెట్లో సైతం చేతినేసిన వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు రావడానికి కారణం మన నేతన్నల నైపుణ్యమే. అయినప్పటికీ అలాంటి కళాకారులు అనేక ఆర్థిక ఇబ్బందులు, మార్కెట్ సమస్యలు, ముడి సరుకు ధరల పెరుగుదల వంటి సవాలను ఎదుర్కొంటున్నారు. నేతన్న చేతి కష్టం కేవలం ఒక చీరను మాత్రమే కాదు... భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాన్ని కళాత్మక వారసత్వాన్ని అల్లుతోంది. అందుకే ఈ కళను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. చేనేత వస్త్రాలను ఆదరించడం ద్వారా నేత కుటుంబాలకు ఉపాధి కల్పించడమే కాకుండా మన సంస్కృతిక వారసత్వాన్ని కూడా భవిష్యత్ తరాలకు అందించగలరు. అగ్గిపెట్టెలు ఒదిగే పట్టుచీరను నేసే అద్భుత ప్రతిభ మన నేతన్న సొంతం... అలాంటి బంగారు చేతులకు గౌరవం, గుర్తింపు, గిట్టుబాటు జీవనం కల్పించడమే వారికి అందించే నిజమైన నివాళి.



# కరెంట్ బిల్లు ఆధారంతో నిజమైన చేనేత కార్మికులు అన్యాయం

- చేనేత కార్మికులు

యాడికి, ఆగష్టు 6, అనంత జనశక్తి న్యూస్ :

రాష్ట్ర ప్రభుత్వం విశిష్టాత్మకంగా శుక్రవారం న అమలు చేస్తున్న "నేతన్న సేవ పథకం" లో కరెంట్ బిల్లు ఆధారంతో ప్రకటించిన జాబితా లో నిజమైన చేనేత కార్మికులకు అన్యాయం జరిగిందని చేనేత కార్మికులు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో గురువారం చేనేత కార్మికులు తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి కి వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా చేనేత కార్మికులు తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి తో మాట్లాడుతు గ్రౌండ్ స్థాయిలో పరిశీలించి, నిజమైన చేనేత కార్మికులు ఎవరో, చేనేత కార్మికులు ఎవరు కాదో గుర్తించి,నిజమైన చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం ను అందించాలని తెలిపారు.ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులలో అర్హత ఎన్ని,అనర్హత ఎన్ని అనే వివరాలను తెలియచేయాలన్నారు. చేనేత గురించి ఏమి తెలియని వాళ్లు కు అర్హత జాబితా లో పేరు ఉందని, వీటిని పరిశీలించి, అర్హులైన చేనేత కార్మికుల న్యాయం చేయాలని తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు వెంకటరమణ,రవి కుమార్ బాలకృష్ణ, మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం



రాప్తాడు ఆగస్టు 6 అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు మండల పరిధిలో రామినేపల్లి అంగన్వాడి కేంద్రంలోనూ, గొందిరెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలోను, సిడిపిఓ ఉమా శంకరమ్మ , ఆదేశాల మేరకు" ప్రపంచ తల్లిపాల వారోత్సవాల " కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గర్భవతులను ,బాలింతలను పిల్లల తల్లులను సమావేశపరిచి ఈ క్రింది విషయాలను తెలపడం జరిగినది . ప్రతి గర్భిణీ స్త్రీ కూడా ప్రతి ఒక్కరూ ఆస్పత్రుల్లోనే కాన్పులు కావాలని అలాగే పుట్టిన గంటలోపలే "ముర్రుపాలు" పట్టాలని, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని ,6 నెలలు పూర్తి అయినాక 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు అంగన్వాడిలో అందించే బాలామృతం ,పాలు, గుడ్లు పెట్టుతూ ఇంటిలో కూడా చిరుధాన్యాలతోను, ఆకుకూరలతోనూ, కూరగాయలతోనూ, కిచిడీ రూపంలో పెడుతూ తల్లిపాలు 2 సంవత్సరాల వరకు కొనసాగించాలని అలాగే ప్రతి నెల అంగన్వాడీ కేంద్రంలో పిల్లల పెరుగుదల స్థాయి అనగా బరువు ఎత్తులను తీయించుకోవాలని తల్లులకు అవగాహన కల్పించడమైనది. ఇలా చేయడం వలన ప్రతి బిడ్డ పెరుగుదలకు తోడ్పడుతుందని అలాగే తల్లి బిడ్డకు అనుబంధమేర్పడుతుందని, తల్లికి బ్రెస్ట్ క్యాన్సరు ,రొమ్ము క్యాన్సర్, లాంటి వ్యాధులు రాకుండా నివారించగలుగుతాయని తల్లులకు అవగాహన కల్పించడమైనది.

ఈ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి , అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి ,ఈశ్వరమ్మ ,ఓబులమ్మ ,వరలక్ష్మి, ఆశా వర్కర్ రామాంజనమ్మ ,లక్ష్మీదేవి , అంగన్వాడి హెల్పర్స్ నాగలక్ష్మి , లక్ష్మీదేవి, గర్భవతులు ,బాలింతలు ,పిల్లల తల్లులు హాజరవ్వడం జరిగినది.

# మధ్యవర్తిత్వంతో వివాదాలకు శాశ్వత పరిష్కారం

- పెదకూరపాడులో ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కార్యక్రమం

పెదకూరపాడు, ఆగస్టు 6:అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్ రెడ్డి సూచనలతో పల్నాడు జిల్లా పెదకూరపాడులో గురువారం మధ్యవర్తిత్వం (Mediation), రాజీమార్గం మరియు ఉచిత న్యాయ సహాయం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ తో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలకు మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ, సివిల్ తగాదాలు, బ్యాంకు రుణాలకు సంబంధించిన వివాదాలు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రెవెన్యూ వివాదాలు, ప్రీలిటిగేషన్ కేసులు వంటి అనేక అంశాలను మధ్యవర్తిత్వం ద్వారా పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు.సత్తెనపల్లి కోర్టు పరిధిలోని కక్షిదారులు కోర్టు పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్తెనపల్లి బస్టాండ్ సమీపంలోని మార్కెట్ యార్డులో ఉన్న కోర్టును సంప్రదించి, మధ్యవర్తిత్వ సేవలను వినియోగించుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని, ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ అట్లూరి జ్యోతి పాల్గొని




మధ్యవర్తిత్వ విధానం, ఉచిత న్యాయ సేవలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మద్రేబు పీవీటీజీ గ్రామానికి తొలిసారిగా రేషన్ బియ్యం పంపిణీ..



- దింసా నృత్యాలతో గిరిజనుల ఆనందం
- జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన ఆదివాసీ ప్రజలు

అనంతగిరి,అనంత జనశక్తి న్యూస్,ఆగస్టు 6:

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధిలోని కొండ శిఖర గ్రామమైన మద్రేబు పీవీటీజీ (కొందు) గ్రామానికి తొలిసారిగా గ్రామంలోనే రేషన్ బియ్యం పంపిణీ చేయడంతో గ్రామస్తులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. గ్రామంలో నివసిస్తున్న సుమారు 30 కుటుంబాలు ఇప్పటివరకు రేషన్ బియ్యం కోసం 15 కిలోమీటర్ల దూరంలోని వేలమామిడి గ్రామానికి గుర్రాలపై వెళ్లాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నాయి.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు 2026 జూలై 9న గుర్రాలతో మూడు కిలోమీటర్ల మేర వినూత్న ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సంబంధించిన వార్తలు వివిధ డిజిటల్ మీడియా,పత్రికల్లో ప్రచురితమవడంతో జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్‌తో పాటు అధికార యంత్రాంగం స్పందించింది.

దీంతో అధికారుల ఆదేశాల మేరకు వేలమామిడి ఎస్‌హెచ్‌జీ (ఇమ్మానియేల్ గ్రూపు) ఆధ్వర్యంలో మద్రేబు గ్రామంలోనే రేషన్ బియ్యం పంపిణీ చేపట్టారు. దీంతో గ్రామస్థులు బియ్యం బస్తాలను గ్రామ మధ్యలో ఉంచి వాటి చుట్టూ సంప్రదాయ దింసా నృత్యాలు చేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.

ఇదే సందర్భంగా గ్రామానికి రహదారి కల్పన కోసం గతంలో 2024 డిసెంబర్ 21న అనంతగిరి మండలం బల్లగరువుకు వచ్చిన అధికారులు రహదారిని పరిశీలించగా, అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సుమారు రూ.12 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు ఫార్మేషన్ పూర్తై, నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండతాంపల్లి నర్సింగరావు, సిదేరి ముగ్గు, కొండతాంబలి లింబో, కొండతాంబలి జగన్నాథం, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. గోవిందరావు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తమ సమస్యను గుర్తించి గ్రామంలోనే రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికార యంత్రాంగానికి గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అనంతపురంలో జాతీయ హార్టికల్చర్ సంస్థలు ఏర్పాటు చేయాలి

- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 06 :అనంత జనశక్తి న్యూస్



అనంతపురం జిల్లాను దేశంలోనే ప్రముఖ హార్టికల్చర్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ & రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ వినతి పత్రం సమర్పించారు.అనంతపురం జిల్లాలో జాతీయ స్థాయి హార్టికల్చర్ సంస్థలు, పరిశోధన కేంద్రాలు, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.అనంతపురం జిల్లా ప్రస్తుతం "ఆంధ్రప్రదేశ్ ఫ్రూట్ బౌల్"గా పేరుగాంచిందన్నారు. జిల్లాలో సుమారు 1,21,761 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతుండగా, ఏటా 32.63 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. అరటి, దానిమ్మ, బత్తాయి, నారింజ, బొప్పాయి, జామ, సపోటా వంటి పండ్ల ఉత్పత్తిలో జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర మంత్రి కి వివరించారు. వరుస కరువుల కారణంగా వేరుశెనగ సాగు తగ్గినప్పటికీ రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లి తమ ఆదాయాన్ని పెంచుకున్నారని పేర్కొన్నారు.అనంతపురం రైతులు ప్రస్తుతం 26 రకాల పండ్ల పంటలు, 29 రకాల కూరగాయలు, 8 రకాల సుగంధ ద్రవ్యాలు, 7 రకాల తోటల పంటలు, 10 రకాల పూల పంటలు, 5 రకాల ఔషధ మొక్కలు సాగు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా అవకాడో, లీచీ, మకాడామియా, నాన్‌చిల్లింగ్ ఆపిల్ వంటి విదేశీ పంటలను కూడా విజయవంతంగా సాగు చేస్తూ ఆధునిక వ్యవసాయ సాంకేతికతను స్వీకరిస్తున్నారని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రాయలసీమ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ద్వారా వచ్చే మూడు సంవత్సరాల్లో అనంతపురం జిల్లాలో మరో 90 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు విస్తరించనుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40,000 కోట్లతో పాటు కేంద్రం నుంచి రూ.60,000 కోట్ల సహకారం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు రాయలసీమను దేశంలోనే అతిపెద్ద ఉద్యాన కేంద్రంగా మార్చే సామర్థ్యం కలిగి ఉందన్నారు.ఈ నేపథ్యంలో రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా కేంద్ర ప్రభుత్వం అనంతపురంలో నాలుగు కీలక సంస్థలను ఏర్పాటు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

**1.జాతీయ ఉద్యానవన మండలి (National Horticulture Board) ప్రాంతీయ కార్యాలయం :** రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం, నాణ్యమైన నాట్ల సరఫరా, పంట అనంతర మౌలిక వసతులు, మార్కెటింగ్ అనుసంధానం, ఆర్థిక సహాయం అందించేందుకు అవసరమని సూచించారు.

**2. జాతీయ హార్టికల్చర్ శిక్షణ కేంద్రం :** ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన ఉత్పత్తి, పంట అనంతర నిర్వహణ, ఎగుమతి ప్రమాణాలపై రైతులు, యువ పారిశ్రామికవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

**3. ప్రాంతీయ సిట్రస్ పరిశోధన కేంద్రం :** అనంతపురంలో సుమారు 38 వేల హెక్టార్లలో బత్తాయి సాగు జరుగుతున్న నేపథ్యంలో వైరస్ రహిత నాణ్యమైన నాట్లు, పరిశోధన, ధృవీకరించిన బడ్‌వుడ్ సరఫరా కోసం ప్రత్యేక పరిశోధన కేంద్రం అవసరమని వివరించారు.

**4. టెర్మినల్ మార్కెటింగ్ ఫెసిలిటీ :** గ్రేడింగ్, సార్టింగ్, ప్యాకేజింగ్, కోల్డ్ స్టోరేజ్, రైపెనింగ్, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి సమగ్ర సదుపాయాలతో కూడిన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే పంట అనంతర నష్టాలు తగ్గడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర లభించి ఎగుమతులు పెరుగుతాయని తెలిపారు.ఈ నాలుగు కేంద్రాల ఏర్పాటు వల్ల అనంతపురం జిల్లాతో పాటు మొత్తం రాయలసీమ హార్టికల్చర్ రంగం దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందని, రైతుల ఆదాయం పెరగడం, గ్రామీణ ఉపాధి అవకాశాలు విస్తరించడం, ఎగుమతులు పెరగడం, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ నేపథ్యంలో రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని ఎంపీ అంబికా కోరారు.

# అనంత స్పోర్ట్స్ మీట్‌లో దురదకుంట హవా



- హాకీలో బాలురు, బాలికల జట్లు విజేతలు

కళ్యాణదుర్గం ఆగస్ట్ 06అనంత జనశక్తి న్యూస్

అనంత స్పోర్ట్స్ మీట్‌లో దురదకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గురువారం కళ్యాణదుర్గం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన హాకీ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లోనూ విజేతలుగా నిలిచి పాఠశాలకు కీర్తి తీసుకొచ్చారు. పోటీల్లో ప్రారంభం నుంచే దురదకుంట జట్లు సమన్వయంతో కూడిన ఆటతీరును ప్రదర్శించాయి. అద్భుతమైన పాసింగ్, పటిష్ఠమైన రక్షణ, గోల్‌కీపింగ్‌తో ప్రత్యర్థి జట్లను నిలువరించి రెండు విభాగాల్లోనూ ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి.

విద్యార్థుల విజయంపై ప్రధానోపాధ్యాయులు, పీఈటీ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని, ఇదే స్ఫూర్తితో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు.

ఫోటో రైట్ అప్ 1.
విజయం సాధించిన దురద కుంట జట్టు

## విజయవాడలో 'పవర్' సినిమాకు క్లాప్ కొట్టి ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ ఆగస్టు 06, అనంత జనశక్తి న్యూస్

విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలో చిన్న సినిమాగా రూపొందుతున్న "పవర్" చిత్రం గురువారం నాడు ప్రారంభమైంది. వీఆర్పీ క్రియేషన్స్ పతాకంపై వెంకటరమణ పసుపులేటి దర్శకత్వంలో పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిన్న సినిమా ముహూర్తపు సన్నివేశానికి రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కెమెరా స్విచ్ ఆన్ చేసి, తొలి క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పరిమిత బడ్జెట్‌తో నూతన ఆలోచనలతో వస్తున్న 'పవర్' చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర యూనిట్‌కు తన ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, సినిమా విజవంతం కావాలని శుభాకాంక్షలు అందజేశారు.



## లయన్స్ ఆధ్వర్యంలో 550 మంది విద్యార్థులకు దంత పరీక్షలు...

సామర్లకోట, ఆగస్టు 6 :అనంత జనశక్తి న్యూస్

సామర్లకోట లయన్స్ క్లబ్ శ్రీ భీమేశ్వర ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 550 మంది విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుకు దంత పరీక్షలు జరిపి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే దంతాల జాగ్రత్తల పై వైద్యులు డా. గ్రంధి శ్రీలక్ష్మి, డా. చాగంటి వల్లీదేవి, డా. ఎం సుభాష్ రెడ్డి లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, ప్రోగ్రాం చైర్మన్ లయన్ నేదునూరు మురళి కృష్ణ, కార్యదర్శి బడుగు సీతారామరాజు, కోశాధికారి యేలేటి రమేష్ ముఖ్య అతిధి ఈదల ఈశ్వర్ కుమార్, నాయకులు చిత్తూలూరి వీరాజు, కర్రి ఆదినారాయణ రెడ్డి, మార్తల విజయభాస్కర్ రెడ్డి, గుండు శంకరావు, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## సమస్యల పరిష్కార నాణ్యతను మెరుగుపరచాలి



- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్..
- ఆత్మకూరు మండలం పి.యలేరు గ్రామంలో రీసర్వే పనులను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్.. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం తనిఖీ..

అనంతపురం, ఆగస్టు 06 :అనంత జనశక్తి న్యూస్

తహసీల్దార్ కార్యాలయం ద్వారా అర్జీల సమస్యల పరిష్కారంలో నాణ్యతను మరింత మెరుగుపరచాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. గురువారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ఫైళ్లు, మ్యుటేషన్ ఫైళ్లు మరియు ఎఫ్ లైన్ పిటిషన్లను పరిశీలించి, ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ ప్రేమంతకుమార్, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

**పి.యలేరు గ్రామంలో రీసర్వే పనులను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ :**
అంతకుముందు ఆత్మకూరు మండలం పి.యలేరు గ్రామంలో రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో గ్రౌండ్ ట్రూ థింగ్ పనులను పరిశీలన చేశారు. గ్రౌండ్ ట్రూ థింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను జెసి ఆదేశించారు.

## రంగులతో బోధన ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందుతుంది.




- రిషి విద్యాలయంలో రెడ్ కలర్ డే ప్రత్యేక కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా ఎంఈఓ మున్వర్ భాష.

ధర్మవరం ఆగస్టు 6, అనంత జనశక్తి న్యూస్:

పట్టణంలోని రిషి విద్యాలయ ఐఐటీనీట్ ఫౌండేషన్ స్కూల్‌లో చిన్నారుల కోసం రెడ్ కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సికేపల్లి ఎంఈఓ మున్వర్ బాషా రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మున్వర్ బాషా మాట్లాడుతూ..... చిన్నారుల్లో రంగులపై అవగాహన, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు.చిన్నారులు ఎరుపు రంగు దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎరుపు రంగు సూచించే ప్రేమ, ధైర్యం, శక్తి, ఉత్సాహం వంటి విలువలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.... పిల్లల్లో రంగులపై అవగాహనతో పాటు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపయోగపడతాయి అని తెలిపారు. సీఈవో రవీంద్ర మాట్లాడుతూ.... విద్యార్థుల సమగ్ర వికాసమే మా పాఠశాల లక్ష్యం. పుస్తక విద్యతో పాటు ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు, పెంపొందిస్తాయి. ప్రతి విద్యార్థి ఆనందంగా నేర్చుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నాం అని తెలిపారు. ఏజీఎం లిడియా మాట్లాడుతూ.. పిల్లలు ఆటల ద్వారా, ఆనందంగా నేర్చుకున్న పాఠాలు జీవితాంతం గుర్తుంటాయని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి మాట్లాడుతూ... రెడ్ కలర్ ప్రేమ, ధైర్యం, శక్తికి ప్రతీక. విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ రంగా రెడ్డి యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఎల్ నినో ప్రభావం పై రైతులకు అవగాహన..



గాండ్లపెంట, ఆగస్ట్,6, అనంత జనశక్తి న్యూస్,

మండలంలో కటారుపల్లి గ్రామంలో ఎల్ నినో పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాలు డ్రైలాండ్ టెక్నాలజీలు వర్షా భావ పరిస్థితులలో పంటల సాగు నిర్వాహణ పద్ధతులను రైతులకు వివరించారు. అలాగే రైతుల పొలాల్లో వేరుశనగ పంటను పరిశీలించి అందులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచనలు మరియు సలహాలు తెలియ చేయడం జరిగింది.అలాగే

ఆగస్ట్, సెప్టెంబర్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయడం అవసరం. దీనికి అనుసరించాల్సిన ముఖ్యమైన చర్యలు ఇవి. 1 తక్కువ వ్యవధిలో పండే మరియు బెట్టను తట్టుకొని పంట రకాలను ఎంపిక చేసుకోవాలి ఉదాహరణకు కొర్రలో గరుడ రకము 60 రోజుల్లో కోతకు వస్తుంది మరియు బెట్టను తట్టుకుంటుంది. 2 తక్కువ వర్ష భావ పరిస్థితుల్లో వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయ పంటలుగా కంది,సజ్జ, కొర్ర,ఉలవలు, పెసర వంటి పంటలను సాగు చేసుకోవచ్చు.3. ప్రస్తుతం వేరుశనగ, ఆముదం పంటలు వర్షా భావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి ఈ పరిస్థితుల్లో పంటపై కరువు ప్రభావాన్ని తగ్గించి మొక్కల ఎదుగుదల మరియు దిగుబడిని మెరుగుపరచడానికి ఆకులపై పోటాషియం నైట్రేట్ లేదా19-19-19 నీటిలో కరిగే ఎరువు 10 గ్రాములు ఒక లీటర్ నీటికి పోషక ద్రావణాలలో ఏదైనా ఒకదానిని పిచికారి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమానికి మండలంలో కిరణ్ కుమార్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త వేరు శనగ మాధవి లత ప్రధాన శాస్త్రవేత్త, భార్గవ్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, చంద్ర శేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏవో షాదాబ్ , దీపికా యామినీ, గ్రామ రైతులు, పాల్గొన్నారు

# 17న కలెక్టరేట్ వద్ద నిరసనను జయప్రదం చేయండి



**పుట్లూరు, ఆగస్టు 06, అనంతజనశక్తి న్యూస్;**

మండలంలోని కడవకల్లు గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో గురువారం జీపు జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి పాలెం నారాయణస్వామి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజారెడ్డి హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా జీపు జాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.
ప్రజల హక్కుల పరిరక్షణ, రైతులు, కార్మికులు, కౌలు రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, ధరల పెరుగుదల నియంత్రణ, ఉపాధి కల్పన, సంక్షేమ పథకాల సమర్థ అమలు తదితర ప్రజా డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17న అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి నారాయణస్వామి గారు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి చెన్నప్ప యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీటి. రామాంజనేయులు,సిపిఐ నియోజకవర్గ నాయకులు రామాంజనేయులు, ప్రజానాట్యమండలి కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# మీ భూమి మీ హక్కు కార్యక్రమం..



**- జాయింట్ కలెక్టర్ చే రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ..**

**గాండ్లపెంట, ఆగస్టు, 6 , అనంత జనశక్తి న్యూస్,**

మండల మీ భూమి, మీహక్కు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేపరాల గ్రామంలో గురువారం జిల్లా సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకానికి క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. దీన్ని స్కాన్ చేసినట్లయితే రైతుల యొక్క భూమి వివరాలు తెలుస్తాయన్నారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కళావతి, తహసిల్దార్ నరసింహులు, డిప్యూటీ తహసిల్దార్ బాబురావు, తెదేపా మండల కన్వీనర్ ప్రసాద్, వెంకటరమణారెడ్డి, అక్రమ భాష, దౌనకొండ ఆనంద్, వీఆర్వోలు చంద్రశేఖర్, మానస, రామ్మోహన్, రమణ, కిష్టప్ప, తెదేపా నాయకులు చిన్నోడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు.



**- -విజయవంతానికి ఏర్పాట్లు ముమ్మరం....**

**ధర్మవరం ఆగష్టు 6 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచన మేరకు ధర్మవరం పట్టణంలోని కదిరిగేట్ సమీపంలో శుక్రవారం నిర్వహించనున్న 12వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, బీజేపీ నాయకులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వేదిక ఏర్పాటు, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు, పార్కింగ్, తాగునీరు, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించి అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హరీష్‌బాబు మాట్లాడుతూ, ధర్మవరం చేనేతకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, చేనేత కార్మికుల కృషిని గౌరవించే ఉద్దేశంతో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి వెంకటేశ్వర్

**ధర్మవరం ఆగష్టు 6 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం పోలీసు అధికారులతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష సమావేశం జరిగింది. సెప్టెంబర్ 12 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని రాజీకి అనుకూలమైన కేసులను పరిష్కరించుకోవాలని జడ్జ్ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీస్ అధికారులు తమ స్టేషన్ పరిధిలో చాలాకాలంగా పెండింగ్ లో ఉన్న రాజీ కేసులను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడమే ఫ్రెండ్స్ లక్ష్యం

**- డ్రగ్స్ నిర్మూలన, యాంటీ ర్యాగింగ్, మహిళా భద్రత, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు**
**- ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కదిరి రూలర్ సీఐ నాగేంద్ర.**



**తలుపుల ఆగస్టు06 అనంత జనశక్తి న్యూస్**

ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన, యాంటీ ర్యాగింగ్, విద్యార్థుల భద్రత, మహిళా భద్రత మరియు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కదిరి రూరల్ సీఐ నాగేంద్ర హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదని సూచించారు. ర్యాగింగ్ అనేది చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, విద్యాసంస్థల్లో పరస్పర గౌరవం, స్నేహభావంతో మెలగాలని తెలిపారు.అదేవిధంగా విద్యార్థినులు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. అలాగే ఫ్రెండ్స్ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ ముఖ్య అతిథికి దేవుని ప్రతిమ చిత్రపటాన్ని అందించారు. అలాగే ఈ కార్యక్రమాల మీద ఫ్రెండ్స్ ట్రస్ట్ వ్యాసరచన పోటీలు పెట్టి గెలుపొందిన వారికి మెడల్స్ మరియు షీల్డ్ బహుమతులు సిఐ చేతుల మీదుగా ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్సై చెన్నయ్య, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సావిత్రి ,కస్తూరిబాయ్ ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్ ఎద్దుల రాముడు, పోలీస్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**అగళి ఆగష్టు 06,అనంత జనశక్తి న్యూస్ :**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అగళి మండలంలోని అగళి పంచాయితీలో రామాపురం, ఇరిగేపల్లి పంచాయితిలో ఐ.గొల్లహట్టి, యచ్.డి.హళ్ళి పంచాయితీలలో అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవలు నిర్వహించినట్లు సూపెర్వైసర్ లీలావతి తెలిపారు.ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి, బిడ్డ పుట్టిన గంట లోపల ముర్రుపాలు ఇవ్వడం, మొదటి 6నెలల వరకు కేవలం తల్లిపాలు 6నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధాపోషకహారం ఇవ్వడం 2 సం. వరకు తల్లిపాలు ఇవ్వడం గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.డి.పి.ఓ సి. రాధ హాజరై తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమములో ఐసిడియస్ సూపెర్వైసర్ లీలావతి, హెల్త్ సూపర్వైజర్ జయమ్మ, అంగన్వాడీ టీచర్స్,గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు హాజరైనారు.



# విస్తృతంగా వాహనాల తనిఖీలు



- రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన పోలీసులు....

**కదిరి ఆగస్టు06 అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మరియు ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈరోజు సాయంత్రం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, వేగంగా డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు.

అలాగే, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు పోలీసులకు సహకరించి రోడ్డు భద్రతకు తోడ్పడాలని పోలీసు అధికారులు కోరారు.

ఈ కార్యక్రమంలో కదిరి టౌన్ సిఐ వెంకటేశ్వర్లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ రిలే దీక్షలను ప్రజలు పట్టించుకోవడం లేదు...

**- ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- రుద్రంపేటలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం**
**- చంద్రబాబు నగర్ లో 35 ఏళ్లుగా ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం**
**- కోటి 44 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించిన దగ్గుపాటి**
**మెగా డీఎస్సీ, లిక్కర్ స్కామ్ తో పాటు ఏదైనా చర్చించడానికి సిద్ధమన్న దగ్గుపాటి**



**అనంతపురం ఆగస్ట్ 06, అనంత జనశక్తి న్యూస్**

వైసిపి చేస్తున్న రిలే నిరాహార దీక్షలను ఎవరు పట్టించుకోవడంలేదని.. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్ లో ఆయన ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టిడిపి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దగ్గుపాటికి ఘన స్వాగతం పలికారు. చంద్రబాబునగర్ లో ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. చంద్రబాబు నగర్ లో 35 ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రోడ్డుకు పరిష్కారం చూపించారు. నూతనంగా కోటి 44లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్ల పాలనపై ప్రజల్లోకి వెళ్తుంటే విశేష స్పందన వస్తోందన్నారు. మా కార్యకర్తలు ఎక్కడికి వెళ్లినా ప్రజలు మంచి స్వాగతం పలుకుతున్నారని...ఇదే మా పని తీరుకి అద్దం పడుతోందని దగ్గుపాటి అన్నారు. ఒక రుద్రంపేట పంచాయతీలోనే ఈ రెండేళ్లలో 13 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో కనీసం ఇక్కడ ఒక చిన్న అభివృద్ధి కూడా జరగలేదన్నారు. కేవలం చిన్న చిన్న కారణాలవల్ల ఇన్నేళ్లుగా రోడ్డును అలాగే పెండింగ్ లో ఉంచారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతనే దానికి పరిష్కారం చూపించామన్నారు. దీనివలన ఎంతోమంది ప్రజలకు ఉపయోగ చేకూరిందని తెలిపారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు జరగకపోయినా వైసిపి నాయకులు రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. అసలు వీరిని ఎవరు పట్టించుకునే లేదని కేవలం అందులో గొడ్డలి పార్టీ కార్యకర్తలు మాత్రమే పాల్గొంటున్నారని విమర్శలు చేశారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఒకేసారి 16,347 ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశారని గుర్తు చేశారు. గతంలో ఉపాధ్యాయులను బాత్రూంల వద్ద వైన్ షాపుల వద్ద ఉంచి అవమానించిన జగన్ కు, ఉపాధ్యాయ వృత్తిని గౌరవిస్తున్న నారా లోకేష్ గారికి చాలా తేడా ఉందన్నారు. 10వ తరగతి పరీక్ష పేపర్లు ఎత్తుకెళ్లిన వ్యక్తి జగన్ అయితే.. మొదటి నుంచి క్రమశిక్షణగా పెరిగి స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీలో చదివిన వ్యక్తి నారా లోకేష్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో జరిగిన మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. వైసీపీ నాయకులు కేవలం ఉనికి కోసమే ఈరోజు రోడ్ల మీదికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి తిరస్కరణకు గురైన వారు మా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. వారు ఎన్ని కుట్రలు చేసినా.. మేము వెనక్కు తగ్గేదే లేదని ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్లు ఉంటాయని.. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతుందన్నారు. మెగా డీఎస్సీపై సిబిఐ విచారణ కోరుతున్న వైసిపి నాయకులు గతంలో అవినాష్ రెడ్డిని అరెస్టు చేసేందుకు వస్తే ఎందుకు అడ్డుకున్నారని నిలదీశారు. మెగా డీఎస్సీ తో పాటు లిక్కర్ కుంభకోణం ఇలా ఏ అంశం పైన అయినా చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, రుద్రంపేట పంచాయతీ టిడిపి అధ్యక్షుడు కోనంకి భక్తవత్సలం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ గోపాల్ గౌడ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, మార్కెట్ డైరెక్టర్ బోయపాటి బాలప్ప, యూనిట్ ఇన్చార్జిలు కదిరప్ప, వెంకటరాముడు, ఆది, కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, కడియాల కొండన్న, పరమేశ్వర్, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, టిడిపి నాయకులు కుమార్ నాయుడు, కొత్తకోట ఖాసీం, నాగభూషణం, ఎస్ఎం భాష, దబ్బర నవీన్ కుమార్, పెద్దన్న, బిజెపి నాయకుడు గణేష్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు తేజశ్విని ఎంపిక

**సామర్లకోట, ఆగస్టు 6 :అనంత జనశక్తి న్యూస్**

**జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ సామర్లకోట పాఠశాలకు చెందిన కుమారి అల్లంపల్లి తేజస్విని సాయి 10వ తరగతి విద్యార్థిని జులై 26 వ తేదీన కాకినాడ డిఎస్సి గ్రౌండ్ లో జరిగిన సౌత్ జోన్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలలో అండర్ 16 విభాగంలో పెంటాథ్లాన్ లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయింది. దానితో విద్యార్థిని అభినందించే కార్యక్రమం గురువారం పాఠశాలలో నిర్వహించారు. అల్లంపల్లి తేజస్విని సాయి తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో ఆగస్టు 11 నుంచి 13 వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్లో పాల్గొనడం జరుగుతుందని హెచ్ ఎం విజయలక్ష్మి చెప్పారు. ఈ సందర్భంగా తేజస్విని ప్రతిభను పాఠశాల హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి, పిడి లు మేరి హావీలా, ఆర్ వరలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ భవాని, వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు తదితరులు కొనియాడుతూ అభినందించారు.**



# డిఎస్సీ అక్రమాలకు భేషరతుగా విద్యా మంత్రి లోకేష్ రాజీనామా చెయ్యాలి



- రిలే దీక్షలో దవులూరి దొరబాబు డిమాండ్

సామర్లకోట, ఆగస్టు 6 అనంత జనశక్తి న్యూస్

డి ఎస్సీ లో జరిగిన అక్రమాలకు భేషరతుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చెయ్యాలని వైసీపీ పెద్దాపురం ఇంచార్జి దవులూరి దొరబాబు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ స్కాంపై సీబీఐ విచారణ జరిపించాలని, డీఎస్సీ లీకేజీ, అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని, ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి నెలకు రూ. 3000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ సామర్లకోట రింగ్ రోడ్ సెంటర్ వద్ద డీఎస్సీకి వ్యతిరేకంగా వైసిపి శ్రేణులు గురువారం రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ శిబిరాన్ని నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ దొరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ డీఎస్సీ పేరుతో, స్పోర్ట్స్ కోట పేరుతో కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. డీఎస్సీ పై సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. నేటి నుంచి తొమ్మిదో తేదీ ఆదివారం వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగితేయని, 10వ తేదీన నియోజకవర్గంలో ర్యాలీ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావు, ఆవాల లక్ష్మీనారాయణ, ఊబా జాన్ మోజేష్, నెక్కంటి సాయి ప్రసాద్,
పాగా సురేష్ కుమార్, మన్యం చంద్రరావు, కరణం రాజ్ కుమార్, కరణం భాను, ఇరుసుమల్ల సాయి, తలారి దొరబాబు, బొబ్బరాడ సత్తిబాబు, నేతల హరిబాబు, సేపేనీ రూపా సురేష్, తలారి దొరబాబు, పాలిక కుసుమ చంటిబాబు, చిట్టిమాని శ్రీనివాసరావు, మడికి మేరీ సోనియా, వారా సుధాకర్, మోరంపూడి రంగ, రెడ్డి లోవ కుమారి వాసు, తదితరులు పాల్గొన్నారు.

# హస్తకళలకు సాంకేతిక వెలుగులు

- ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ సూచనతో ప్రత్యేక క్యూఆర్ కోడ్ విధానం ప్రారంభం
- ఒక్క స్కాన్‌తో కళాఖండం చరిత్ర, కళాకారుడి వివరాలు, ఉత్పత్తి విశిష్టత పూర్తి సమాచారం

నకిలీ ఉత్పత్తులకు అడ్డుకట్ట...
ప్రపంచ మార్కెట్‌లో ఏపీ హస్తకళలకు మరింత గుర్తింపు

విజయవాడ, ఆగస్టు 6:అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు కళాకారులకు తగిన గౌరవం, మార్కెట్ విలువ కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు దేశంలోనే తొలిసారిగా హస్తకళా ఉత్పత్తులకు ప్రత్యేక క్యూఆర్ (QR) కోడ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.ఇటీవల నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా ప్రతి హస్తకళా ఉత్పత్తికి ప్రత్యేక డిజిటల్ గుర్తింపు కల్పించి, దానిని రూపొందించిన కళాకారుడి కృషి, కళా వారసత్వం, ఉత్పత్తి విశిష్టత గురించి వినియోగదారులకు పూర్తి సమాచారం అందేలా సాంకేతికతను వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. ఆయన దిశానిర్దేశంతో లేపాక్షి అధికారులు కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఈ విధానాన్ని రూపొందించి అమలులోకి తీసుకొచ్చారు.

**ఒక్క స్కాన్‌తో పూర్తి సమాచారం**

ప్రతి హస్తకళా ఉత్పత్తిపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే ఆ కళాఖండానికి సంబంధించిన పూర్తి వివరాలు క్షణాల్లో అందుబాటులోకి వస్తాయి. ఆ కళారూపం చరిత్ర, సాంస్కృతిక విశిష్టత, తయారు చేసిన కళాకారుడి పేరు, వారి నైపుణ్యం, ఉపయోగించిన ముడిసరుకు, తయారీకి పట్టిన సమయం, ఉత్పత్తి కొలతలు, భౌగోళిక గుర్తింపు (GI) లేదా 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి (ODOP)' గుర్తింపు వంటి వివరాలన్నీ వినియోగదారులు తెలుసుకోవచ్చు.

**మొదటి దశలో ఎనిమిది ప్రముఖ హస్తకళలు**

మొదటి దశలో రాష్ట్ర హస్తకళా వైభవానికి ప్రతీకలుగా నిలిచే ఎనిమిది ప్రముఖ ఉత్పత్తులకు క్యూఆర్ కోడ్ ప్రొఫైల్స్ రూపొందించారు. బొబ్బిలి వీణతో పాటు కలంకారి కళలో రూపొందించిన సంపూర్ణ రామాయణం, మహాభారతం, శ్రీకృష్ణలీల, మత్స్యావతారం చిత్రాలు, అలాగే సవర ఆదివాసీ చిత్రకళకు ఈ డిజిటల్ గుర్తింపు కల్పించారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని హస్తకళా ఉత్పత్తులు, కళాకారుల క్లస్టర్లకు ఈ విధానాన్ని విస్తరించనున్నారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా హస్తకళా ఉత్పత్తుల ప్రామాణికతను సులభంగా నిర్ధారించడంతో పాటు నకిలీ ఉత్పత్తులకు అడ్డుకట్ట పడనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత విశ్వసనీయత పెరిగి, సంప్రదాయ కళాకారులకు మెరుగైన ఆదాయ అవకాశాలు లభించేలా ఈ కార్యక్రమం దోహదపడనుంది.ఈ సందర్భంగా లేపాక్షి మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ మాట్లాడుతూ, "క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు కళాకారులకు తగిన గుర్తింపు, మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించగలుగుతాం" అని తెలిపారు.



| Sl No. | Artwork & Artisan | Image | Description QR Code |
|---|---|---|---|
| 01 | Bobbili Ekanda Veena by Sri Bonumaddi Murali | | |
| 02 | Mahabharatam by Late Sri C. Subramanyam | | |
| 03 | Sri Krishna Leela by Late Sri C. Subramanyam | | |
| 04 | The Sampurna Ramayanam by Late Sri C. Subramanyam | | |
| 05 | Matsyavataram by M. Viswanatha Reddy | | |

# హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో...'అమలు

- రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత
- నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం
- ఏటా రూ.25 వేలు అందజేసే పథకానికి నేడు శ్రీకారం
- చేనేతలకు చంద్రన్న పాలన ఎప్పుడూ స్వర్ణయుగమే : మంత్రి సవిత
- చీరాలలో నేడు 12 జాతీయ చేనేత దినోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు అనగాని, సవిత



చీరాల/బాపట్ల ఆగస్టు 06, అనంత జనశక్తి న్యూస్

నేతన్నల బాగుకోరే ప్రభుత్వం తమదని, ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుడుతున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏటా రూ.25 వేల ఆర్థిక సహాయమందిస్తూ, చేనేత కుటుంబాల్లో వెలుగులు నింపనున్నారన్నారు. సీఎం చంద్రబాబు పాలన చేనేతలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనన్నారు. జగన్ పాలనలో నేతన్నలు కష్టాల పాలయ్యారని, 201419 మధ్య చేనేత రంగ అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను నిలిపేశారని మండిపడ్డారు. చీరాలలో 12 జాతీయ చేనేత దినోత్సవ వేడుకల ఏర్పాట్లను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే మద్దులూరు మాలకొండయ్యతో కలిసి మంత్రి సవిత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తనను కలిసి విలేకరులతో మాట్లాడారు. చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఒకవైపు చేనేత రంగ అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతూనే, నేతన్నలకు వ్యక్తిగత ఆర్థిక లబ్ధి కలిగేలా సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా మగ్గం నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం**

నేతన్నలకు మరింత మేలు చేసేలా సీఎం చంద్రబాబునాయుడు నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. ఈ పథకం ఏటా రూ.25 వేలను అర్హులైన చేనేతలకు అందజేయనున్నామన్నారు. ఎన్నికల్లోనూ, కూటమి మేనిఫెస్టోలోనూ హామీ ఇవ్వకపోయినా, చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని శుక్రవారం జరిగే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సీఎం చంద్రబాబునాయుడు చేనేత రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. 201419 మధ్యలో నేతన్నల అభ్యున్నతికి ఎన్నో పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. చంద్రబాబు పాలన ఎప్పుడూ చేనేతలకు స్వర్ణయుగమేనన్నారు. తరవాత వచ్చిన జగన్ అన్ని రంగాల మాదిరిగా చేనేతను భ్రష్టుపట్టించారని మంత్రి సవిత మండిపడ్డారు.

**పకడ్బందీ ఏర్పాట్లు చేయండి...**

అంతకుముందు మంత్రి సవిత చీరాలలో జరిగే 12 చేనేత జాతీయ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు.
మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే మద్దులూరు మాలకొండయ్యతో కలిసి వేదికను, ప్రాంగణాన్ని సందర్శించారు. చేనేతలు, స్థానికులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి తరలొచ్చే అవకాశముందని, పార్కింగ్ కు, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, చేనేత, జౌళి శాఖాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ రిలే నిరాహార దీక్షలకు సీపీఐ మద్దతు




- అనంతలో సంఘీభావం ప్రకటించిన సీపీఐ జగదీష్, ఇతర నేతలు

అనంతపురం, ఆగస్టు 6 : అనంత జనశక్తి న్యూస్

విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలతో పాటు డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ, మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సీపీఐ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ తెలిపారు. గురువారం అనంతపురం మునిసిపల్ కార్యాలయం ఎదుట వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు ఆయన సంఘీభావం ప్రకటించారు. జగదీష్‌తో పాటు సీపీఐ, ఏఐవైఎఫ్ నేతలు లింగమయ్య, రమణ, శ్రీరాములు తదితరులు దీక్షా శిబిరంలో కూర్చుని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ అక్రమాల్లో అక్రమాలు జరిగాయని, పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలం అయ్యారన్నారు. రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల దందాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. విజయవాడలో శాంతియుతంగా రిలే దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై దాడులకు పాల్పడడం మంచిది కాదన్నారు. అనంతపురం జిల్లాలోని యాడికిలోనూ వైఎస్ఆర్‌సీపీ నాయకులపై దాడులు జరిగాయన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు వీటికి సమాధానం ఇవ్వాలన్నారు. తాడిపత్రిలో మీరే రాజులు.. మరొకరు రాకూడదని శాసిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఒక మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో తిరగలేని పరిస్థితి రావడం దారుణమన్నారు. విజయవాడ, యాడికి ఘటనలకు పోలీసులు బాధ్యత వహించాలని తెలిపారు. ఇలాంటి ఘటనలను ప్రోత్సహిస్తే చంద్రబాబుకు నూకలు చెల్లుతాయని హెచ్చరించారు. రిలేదీక్షలకు సీపీఐ మద్దతు ప్రకటించడంపై వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పందించారు. భవిష్యత్‌లో కూడా చంద్రబాబు అప్రజాస్వామిక చర్యలు, ప్రజావ్యతిరేక విధానాలపై కలిసికట్టుగా పోరాడుతామని చెప్పారు.

# అభివృద్ధి, సంక్షేమంతో మూడోయేటా పాలన : ఎమ్మెల్యే



సామర్లకోట, ఆగస్టు 6 :అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం మూడోయేట పరిపాలన బ్రహ్మాండంగా జరుగుతుందని, ఈ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. గురువారం సామర్లకోట పట్టణ పరిధిలోని 26వ వార్డులో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంటింటా తెలుగుదేశం, కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వల్లే కూటమి ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని ప్రజలు గుర్తించినప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అభివృద్ధి కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా ప్రజల సహకారంతో కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి అభివృద్ధిపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమం లో నాయకులు అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, సరోజ వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, నిమ్మకాయల కిరణ్, అత్తిలి కృష్ణ, బొందల రామలక్ష్మి, గోలి సత్తిరాజు, పడాల వీరబాబు, దాట్ల శ్రీనివాస్, పైణ్ణి శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగుల బాలబాలికలకు ఆర్థిక విరాళం



- ప్రముఖ న్యాయవాది గుంటప్ప చేయూత

ధర్మవరం ఆగస్టు 6, అనంత జనశక్తి న్యూస్:

పట్టణంలోని కొత్తపేట టెలిఫోన్ ఆఫీస్ సమీపంలో గల మానసిక వికలాంగుల బాలబాలికల సంక్షేమానికి ప్రముఖ న్యాయవాది, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి గుంటప్ప తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉదారంగా విరాళం అందజేశారు. బాలబాలికల మధ్యాహ్న భోజనానికి వారం రోజుల పాటు అయ్యే మొత్తం ఖర్చును భరించేలా ఆర్థిక సహాయాన్ని అందించి తన సేవా భావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా గుంటప్ప మాట్లాడుతూ..... సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతను గుర్తించి అవసరమైన వారికి చేయూత అందించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల స్మారకార్థంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గుంటప్ప చేసిన విరాళాన్ని అభినందిస్తూ, ఆయన సేవా దృక్పథం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మానసిక వికలాంగుల బాలబాలికల సంక్షేమానికి సమాజం నుంచి ఇలాంటి సహకారం మరింత పెరగాలని ఆకాంక్షించారు.

# చేనేత కార్మికులకు ఉచిత కంటి పరీక్షల శిబిరం



ధర్మవరం ఆగస్టు 6 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరంలోని స్టేట్ బ్యాంక్ కాలనీలో ఉన్న మధు కంటి వైద్యశాలలో చేనేత కార్మికుల కోసం ఈ నెల 7వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ కంటి వైద్యులు డాక్టర్ నరసింహులు తెలిపారు. గురువారం శిబిరానికి సంబంధించిన కరపత్రాలను చేనేత మహిళా నాయకురాలు ఎస్. జయశ్రీతో పాటు పలువురు చేనేత కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చేనేత కార్మికులు నిరంతరం సూక్ష్మమైన పనులు చేయాల్సి ఉండటంతో కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. ఈ ఉచిత శిబిరంలో చేనేత కార్మికులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కంటి ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# మీ భూమి మీ హక్కు కార్యక్రమం..

- జాయింట్ కలెక్టర్ చే రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ..

గాండ్లపెంట, ఆగస్టు, 6 , అనంత జనశక్తి న్యూస్,

మండల మీ భూమి, మీహక్కు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేపరాల గ్రామంలో గురువారం జిల్లా సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకానికి క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. దీన్ని స్కాన్ చేసినట్లయితే రైతుల యొక్క భూమి వివరాలు తెలుస్తాయన్నారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కళావతి, తహసిల్దార్ నరసింహులు, డిప్యూటీ తహసిల్దార్ బాబురావు, తెదేపా మండల కన్వీనర్ ప్రసాద్, వెంకటరమణారెడ్డి, అక్రమ భాష, దొనకొండ ఆనంద్ సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి ,వీఆర్వోలు చంద్రశేఖర్, మానస, రామ్మోహన్, రమణ, కిష్టప్ప, తెదేపా నాయకులు చిన్నోడు, పలువురు రైతులు పాల్గొన్నారు.



## మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆదిత్య ప్రో. ఛాన్సలర్ డా. సతీష్ రెడ్డి దంపతులు

పెద్దాపురం, ఆగస్టు 6 :అనంత జనశక్తి న్యూస్

పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ మరిడమ్మ అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి శృతి రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పరిపాలనాధికారి కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదాశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదం అమ్మవారి చిత్రపటం, అందించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి దంపతులు ఆలయ అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయల విరాళం అందజేశారు.



## నేతన్న నెత్తుటి నూలు... మంజుల పత్తిపాటి .

మగ్గం మోగితే మన సంస్కృతి మేల్కొంటుంది...
కానీ ఆ ఇంట్లో నవ్వులు మోగడం లేదు..!
నూలు కదిలితే నవభారత కీర్తి ముందుకు సాగుతోంది...
కానీ ఆ కుటుంబం బతుకు ముందుకు సాగడం లేదు..!

చెమటను అద్భుత డిజైన్లతో చీరలో మలిచినాడు..!
కన్నీటిని కనురెప్పల మాటున దాచుకుంటున్నాడు..!

అతడు అల్లిన పట్టు...
ఉన్నవారి ఇంట పసిడి నవ్వవుతుంది..!
తన ఇంట మాత్రం చినిగిన చీర
దర్శనము ఇస్తున్నది..!

దేశం అతని కళను కొనియాడుతుంది
కానీ.. కళకు తగిన ప్రతిఫలం లేక
అన్నం గిన్నె అటుకు ఎక్కి అలిగింది..!
అతడు అల్లిన చీరకు కాలి చప్పట్లు జేజేలు... అందుకే అతని కూతురి పెళ్లి అప్పల ముసుగులోనే ఆగిపోయింది..!
కళను కాపాడిన కర్మయోగి నేతన్న,
కలలను నేసిన కవియోగి నేతన్న,
అందుకే నేతన్నను కాపాడుకుందాం
జాతీయ చేనేత దినోత్సవాన్ని
గర్వంగా జరుపుదాం.



రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి: బోయ గిరిజమ్మ



అనంతపురం, ఆగస్టు 6:అనంత జనశక్తి న్యూస్

విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బోయ గిరిజమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, ఏళ్ల తరబడి కష్టపడి చదివి పరీక్షలు రాసిన లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. మెరిట్ జాబితాల్లో మార్పులు, అభ్యర్థుల సమాచారం కనుమరుగవడం, క్రీడల కోటా నియామకాలలో అవకతవకలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. విద్యాశాఖ నిర్వహణలో మంత్రి నారా లోకేష్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తూ, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే 2025 డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు నిరుద్యోగ భృతిని కూడా తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ మాజీ మేయర్, మాజీ డిప్యూటీ మేయర్లు, వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందే..!

- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్
- అనంతపురంలో 'రిలే నిరాహార దీక్ష'లు ప్రారంభం
- గుంతకల్లు, కదిరిలో అర్హత ఉన్నా అభ్యర్థులకు దక్కని పోస్టులు
- గుంతకల్లులో ఏకంగా టీడీపీ జెండాలు పెట్టుకుని బాధితుల ఆందోళన
- డీఎస్సీలో అక్రమాలు జరిగాయనడానికి ఇంతకంటే సాక్ష్యం కావాలా?
- నిరుద్యోగ యువతకిచ్చిన నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలి
- తక్షణం ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- లోకేష్ రాజీనామా చేసే వరకు ఉద్యమిస్తామని అనంత స్పష్టీకరణ

అనంతపురం, ఆగస్టు 06 : అనంత జనశక్తి న్యూస్



డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందేనని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలతో పాటు డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అనంతపురంలోని మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం అయ్యాయి. తొలి రోజు దీక్షలో వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం, ట్రేడ్ యూనియన్ నేతలు, 1వ డివిజన్ నుంచి 13వ డివిజన్లకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, నిరుద్యోగులు కూర్చుకున్నారు. దీక్షా శిబిరాన్ని అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై మండిపడ్డారు. ఎన్నికల ముందు ఉద్యోగాలు ఇస్తాం, లేకపోతే ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు రెండేళ్లు గడిచినా హామీని అమలు చేయలేదన్నారు. 25 నెలలకు గాను ఒక్కో నిరుద్యోగికి రూ.75 వేలు బకాయి పడ్డారని తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కింద రూ.9500 కోట్ల బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగుల జీవితాలతో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెలగాటం ఆడారని మండిపడ్డారు. స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని, బేరం పెట్టి పోస్టులను అమ్ముకున్నారని ఆరోపించారు. ఇందుకోసం ఏకంగా జీవోలను కూడా మార్చారని విమర్శించారు. ఇదే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గుంతకల్లు, కదిరిలో అర్హత ఉన్నా అభ్యర్థులకు టీచర్ పోస్టులు రాలేదని తెలిపారు. గుంతకల్లులో ఓ టీడీపీ నాయకుడి కుమార్తె పద్మావతి తనకు అన్యాయం జరిగిందని టీడీపీ జెండాలు పెట్టుకుని కుటుంబ సభ్యులతో మునిసిపల్ ఆఫీస్ ముందు నిరాహార దీక్ష చేస్తున్నారని తెలియజేశారు.

కదిరిలో దివ్యాంగ అభ్యర్థికి అర్హత ఉన్నా పోస్టు రాలేదన్నారు. సదరు అభ్యర్థి తన వైకల్యానికి సంబంధించి మెడికల్ రీఎగ్జామ్ చేసుకుని వెళ్లినా పోస్టు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని చెప్పడానికి ఇంతకంటే సాక్ష్యం మరొకటి కావాలా? అని ప్రశ్నించారు. నారా లోకేష్ రాజీనామా చేసే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

# వైసిపి ప్రభుత్వ హయాంలో,పరిశ్రమలు వెళ్లగొట్టారు

- కూటమి ప్రభుత్వంతో రెండేళ్లలో రాష్ట్రానికి 24 లక్షల కోట్లతో భారీ పెట్టుబడులు
- ఒక్క పుట్టపర్తి నియోజకవర్గానికే రూ.1.51 లక్షల కోట్ల భారీ పరిశ్రమలు
- రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయం:
- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

అమడగూరు ఆగస్టు 6 అనంత.జనశక్తి. న్యూస్.



వైసీపీ పాలనలో రాష్ట్రానికి రావాల్సిన అనేక పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి సుమారు రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.

ఆమడగూరు మండలంలోని జౌకలకొత్తపల్లి గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పుట్టపర్తి నియోజకవర్గానికి రూ.1.51 లక్షల కోట్ల విలువైన భారీ పరిశ్రమలు మంజూరయ్యాయని, వాటి ద్వారా వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.

రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు భూ హక్కులను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తోందని పేర్కొన్నారు. రైతుల అభ్యున్నతికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతోందని చెప్పారు.

అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాలలో అందుతున్న విద్యాభ్యాసం, విద్యా ప్రగతి, నాణ్యమైన భోజనం , పౌష్టికాహారంపై విద్యార్థులతో ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేలా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకుని వారికి ప్రోత్సాహకరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నోటు పుస్తకాలను విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు కార్పొరేషన్ చైర్మన్ స్వప్న పార్వతమ్మ, ఏపీ యు ఎఫ్ ఐ డి సి రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి , ఇన్చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి నల్లమడ సిఐ శ్రీనివాసులు ,ఎంపీడీఓ శకుంతల , ట్రాన్స్కో ఏఈ చంద్రనాయక్ రఘువీరారెడ్డి బోడెప్ప అలియాస్ వెంకటరమణ గాండ్ల చెన్నప్ప జనసేన పార్టీ శ్రీనివాసులు ప్రభాకర్ రెడ్డి నాగేందర్ రెడ్డి వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు ఒలిపి కిష్టప్ప మాజీ ఎంపీపీ రామచంద్ర కే రెడ్డప్ప చలమయ్య టైలర్ జయరాం నారాయణస్వామితెలుగుదేశం పార్టీ నాయకులు మండల డీలర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్ఆర్జిసి సిబ్బంది, కార్యకర్తలు, రైతులు, ఉపాధ్యాయుల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన సాకే నరేష్

ఢిల్లీ: ఆగస్ట్ 6 అనంత జనశక్తి న్యూస్



'ఛలో ఢిల్లీ - 2026' కార్యక్రమంలో భాగంగా నేడు జాతీయ బీసీ కమిషన్ (NCBC) చైర్‌పర్సన్ శ్రీమతి సాధ్వి నిరంజన్ జ్యోతి గారిని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా బీసీలు, బీసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా, ఉపాధి మరియు సంక్షేమ సమస్యలపై వారికి సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా సాకే నరేష్ మాట్లాడుతూ... బీసీల సమగ్ర పురోగతి మరియు రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధన కోసం క్రింది ప్రధాన డిమాండ్లను కమిషన్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

బీసీ వర్గాలు & ప్రజా సంక్షేమం కోసం:

-- జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజకీయం, సామాజిక ప్రాతినిధ్యం కల్పించాలి

- బీసీ సంక్షేమ కార్పొరేషన్లకు తగినంత బడ్జెట్ కేటాయించి, సబ్సిడీ రుణాలు సులభంగా అందించాలి

- సాంప్రదాయ కుల వృత్తుల పరిరక్షణకు ప్రత్యేక పథకాలు, ఆధునిక పరికరాలు పంపిణీ చేయాలి

- బీసీ సబ్‌ప్లాన్ చట్టాన్ని ప్రాధాన్యతతో, సమర్థవంతంగా అమలు చేయాలి

- విద్యా, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్ల సమర్థవంతమైన అమలు మరియు రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాలి

బీసీ విద్యార్థుల కోసం:

- నాణ్యమైన విద్య, ఆధునిక వసతులతో కూడిన బీసీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

- స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయాలి

- బీసీ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేయాలి

- UPSC, SSC, Banking తదితర పోటీ పరీక్షలకు ఉచిత నాణ్యమైన కోచింగ్ అందించాలి

- యువతకు నైపుణ్యాభివృద్ధి (Skill Development) శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలను విస్తరించాలి

విభాగాల వారీగా సమర్పించిన వినతిపత్రాన్ని చైర్‌పర్సన్ గారు ఓర్పుగా పరిశీలించారని, అందులోని అంశాలను కేంద్ర ప్రభుత్వం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి సానుకూల చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారని సాకే నరేష్ పేర్కొన్నారు.

బీసీ వర్గాల మరియు విద్యార్థుల సమస్యలపై రాజ్యాంగబద్ధమైన, విధానపరమైన పరిష్కారాలు లభించే వరకు బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## బీసీలకు చట్టసభల్లో 44 శాతం రిజర్వేషన్ల కోసం

# జాతీయ ఉద్యమానికి పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 6:అనంత జనశక్తి న్యూస్

చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 7న న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించనున్న జాతీయ సభను విజయవంతం చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పీఎస్) వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సభకు దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ప్రజా సంఘాలు, బీసీ సంఘాలు, దళిత, గిరిజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.గత 30 ఏళ్లుగా దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు పార్లమెంట్, శాసనసభల్లో రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ అంశంపై అన్ని వర్గాల ప్రజా సంఘాల మద్దతు కూడగట్టి, రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల పెంపు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని అన్ని రాజకీయ పార్టీలు సమర్థించాలని ఆయన కోరారు. ఈ మేరకు వివిధ పార్టీల జాతీయ అధ్యక్షులు, పార్లమెంట్ పక్షనేతలకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ ఉద్యమంలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించి రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నామని చెప్పారు.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర శాసనసభలు బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్మానాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు కూడా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీల రిజర్వేషన్ల అంశాన్ని సామాజిక న్యాయ అజెండాగా చర్చకు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు సమక్షంలో ఆగస్టు 7న ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది బీసీ సంఘాల నాయకులు ఢిల్లీకి బయలుదేరినట్లు వెల్లడించారు.

# షుగర్ ఉన్నవారికి డాక్టర్ సిఫార్స్ చేసిన మూడు పరీక్షలు, తప్పక చేయించుకోవాలి లేదంటే మీ కళ్లు, కిడ్నీలకే డ్యామేజ్





### డయాబెటిస్ ఉంటే కనిపించే లక్షణాలు

తరచుగా మూత్రవిసర్జన
విపరీతమైన దాహం
అధిక ఆకలి
అలసట, బలహీనత
అస్పష్టమైన దృష్టి
బరువు తగ్గడం







డయాబెటిస్.. ఇప్పుడు చాలా మందిని ఇబ్బంది పెడుతున్న సమస్య. ఇది చాలా నెమ్మదిగా ప్రారంభమమవుతుంది. చాలా మంది తీవ్రమైన సమస్యలు తలెత్తే వరకు తమకు ఈ వ్యాధి ఉందని గ్రహించరు. అయితే, డయాబెటిస్‌ని నిర్లక్ష్యం చేస్తే అది నెమ్మదిగా శరీరాన్ని గుల్ల గుల్ల చేస్తుంది. తెలుసుకునేలోపు జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోతుంది. ఇది ఒక జీవనశైలికి సంబంధించిన వ్యాధి. అందుకే సరైన లైఫ్‌స్టైల్ పాటించాలి. ఇక, షుగర్ ఉన్నవారు కొన్ని పరీక్షలు కూడా తప్పకుండా చేయించుకోవాలి. ఈ పరీక్షల ద్వారానే షుగర్ లెవల్స్ అదుపులో ఉన్నాయో లేదో తెలుస్తుంది. ఇక, ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ బ్రిజ్మోహన్ అరోరా మూడు పరీక్షల్ని సిఫార్స్ చేస్తున్నారు. డాక్టర్ బ్రిజ్మోహన్ అరోరాకి 24 సంవత్సరాల అనుభవంతో ఈ పరీక్షల్ని సిఫార్స్ చేస్తున్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆ పరీక్షల్ని సూచించారు. దీర్ఘకాలిక సమస్యల్ని నివారించడానికి, నాణ్యమైన జీవితాన్ని నిర్వహించడానికి ఇది చాలా ముఖ్యం. ఆ మూడు పరీక్షలేంటి, ఎందుకు షుగర్ పేషంట్లు చేయించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**డయాబెటిస్‌ని ముందస్తుగా గుర్తించడం ఎందుకు ముఖ్యం?**

డయాబెటిస్ చికిత్స ప్రారంభించడానికి కేవలం మూడు రక్త పరీక్షలు సరిపోతాయని డాక్టర్ అరోరా వివరిస్తున్నారు. మీకు డయాబెటిస్ ఉంటే లేదా వచ్చే అవకాశాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించి అవసరమైన మూడు పరీక్షలు చేయించుకోవాలని ఆయన సలహా ఇస్తున్నారు. డయాబెటిస్‌ని సకాలంలో గుర్తించాలి. లేదంటే అది చేయాల్సిన డ్యామేజ్‌ని చేసేస్తుంది. డయాబెటిస్ నిర్ధారణ అయితే చికిత్స సరైన సమయంలోయ అందుతుంది. లేదంటే మీ అంతర్గత అవయవాల్ని ప్రమాదంలో పడేస్తుంది.

**మధుమేహానికి 3 ముఖ్యమైన రక్త పరీక్షలు**

HbA1c: ఇది గత మూడు నెలల్లో రక్తంలో చక్కెర స్థాయిల సగటును నిర్ధారిస్తుంది.

FBS (ఫాస్టింగ్ బ్లడ్ షుగర్): ఇది ఖాళీ కడుపుతో చేయించుకోవాల్సిన షుగర్ పరీక్ష. తినకముందు రక్తంలో షుగర్ లెవల్స్ పరీక్షిస్తారు.

PPBS: ఏదైనా తిన్న రెండు గంటల తర్వాత రక్తంలో షుగర్ స్థాయిల్ని చెక్ చేయడానికి ఈ పరీక్ష నిర్వహిస్తారు.

ఈ మూడు పరీక్షలు ఏ వైద్యుడైనా సరే డయాబెటిస్‌ను నిర్ధారించడానికి.. దాని తీవ్రతను అంచనా వేయడానికి సాయపడతాయి. అంతేకాకుండా డైట్, మెడిసిన్, చికిత్స అందించడానికి సాయపడతాయి.

**డయాబెటిస్ ఆలస్యంగా నిర్ధారణ చేయడం వల్ల కలిగే నష్టాలు**

డయాబెటిస్‌కు చికిత్స ఆలస్యం చేయడం వల్ల తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయని డాక్టర్ అరోరా హెచ్చరిస్తున్నారు. ఆలస్యం ప్రమాదకరం అని నిపుణులు అంటున్నారు. ఆలస్యంగా నిర్ధారణ చేయడం వల్ల నరాలు (డయాబెటిక్ న్యూరోపతి), కళ్ళు (డయాబెటిక్ రెటినోపతి), కిడ్నీలు, గుండె వంటి వాటికి డ్యామేజ్ జరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరిస్తున్నారు. ముందుగానే చికిత్స ప్రారంభించడం వల్ల దీర్ఘకాలిక నష్టం జరిగే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. రోగులు డయాబెటిస్‌ను సమర్థవంతగా నిర్వహించడంలో సాయపడుతుంది.

# వయస్సు మీద పడటాన్ని ఆలస్యం చేసే వ్యాయామాలు, డాక్టర్ ప్రకారం ఏది బెస్ట్ అంటే





సాధారణంగా ఫిట్‌నెస్ అనగానే అందరూ బరువు తగ్గడం గురించి ఆలోచిస్తారు. అయితే మన చర్మం ఆరోగ్యంగా ఉండాలన్నా, వయసు పెరిగినా ముఖంలో ఆ మెరుపు తగ్గకుండా ఉండాలన్నా మనం చేసే వ్యాయామం చాలా కీలకం. వయస్సు పెరిగినా అలా కనిపించకుండా ఉండేందుకు, అలాగే ఆరోగ్యం కోసం కొన్ని వ్యాయామాలు చాలా మంచి ఫలితాలనిస్తాయి. అసలు ఏ వ్యాయామం ఎంతవరకు ఉపయోగపడుతుందో చెబుతూ ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో పోస్ట్ చేశారు. ఏ వ్యాయామానికి ఎంత రేటింగ్ ఇచ్చారో, ఎందుకు ఇచ్చారో ఇప్పుడు చూద్దాం.





**స్ట్రెంత్ ట్రైనింగ్ మంచిది**

కండరాలు పెరిగినప్పుడు అది చర్మం సాగకుండా చూస్తుందని, ఎముకల బలానికి ఇది ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. యాంటీ ఏజింగ్ ప్రయోజనాలు పొందాలనుకునే వారు కచ్చితంగా వెయిట్ లిఫ్టింగ్ లేదా రెసిస్టెన్స్ ట్రైనింగ్ చేయాలని ఆమె సూచించారు. దీని తర్వాత పైలేట్స్, ఫంక్షనల్ ట్రైనింగ్ రెండింటికీ 9 పాయింట్ల చొప్పన రేటింగ్ ఇచ్చారు. ఇవి శరీరాన్ని ఫ్లెక్సిబుల్‌గా ఉంచడమే కాకుండా కోర్ స్ట్రెంత్‌ను పెంచుతాయి.

**నడక, యోగాకు ఎంతంటే?**

ప్రతిరోజూ చేసే వాకింగ్‌కు ఆమె 7 పాయింట్లు ఇచ్చారు. ఇది గుండె ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, కేవలం నడక వల్ల మాత్రమే యాంటీ ఏజింగ్ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో లభించవని స్పష్టం చేశారు. అలాగే మానసిక ప్రశాంతత, శారీరక ప్రయోజనాల కోసం చేసే యోగాకు 8, స్విమ్మింగ్‌కు 8 రేటింగ్ ఇచ్చారు. ఈ రెండూ శరీరంలోని ఒత్తిడిని తగ్గించి హార్మోన్ల సమతుల్యతను కాపాడుతాయని డాక్టర్ అభిప్రాయపడ్డారు.

**దేనికి ఎంత రేటింగ్?**

యానిమల్ ఫ్లో: 8
హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ : 6-7
సైక్లింగ్: 6
రన్నింగ్: 4
జుంబా: 4
స్ట్రెచింగ్: 3

**అధిక కార్డియోతో జాగ్రత్త!**

కేవలం కార్డియో చేసే వారికి ఆమె మైనస్ రేటింగ్ ఇచ్చారు. ఎక్కువ సమయం కార్డియో చేయడం వల్ల ముఖంలోని కొవ్వు కరిగిపోయి, చర్మం త్వరగా ముడతలు పడే అవకాశం ఉంటుందని, దీనినే 'రన్నర్స్ ఫేస్' అంటారని ఆమె వివరించారు.

వ్యాయామం అనేది అన్ని రకాల కండరాలకు ప్రయోజనం చేకూరే విధంగా ఉండాలని ముఖ్యంగా యాంటీ ఏజింగ్ కోసం స్ట్రెంత్ ట్రైనింగ్‌ను నిర్లక్ష్యం చేయకూడదని ఆమె స్పష్టంగా చెప్పారు.

**జీవనశైలి కూడా ముఖ్యమే**

ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు సరైన వ్యాయామం ఎంచుకోవడం ద్వారా యవ్వనాన్ని కాపాడుకోవచ్చని డాక్టర్ వివరించారు. మీరు కూడా మీ వయసును బట్టి, శరీర అవసరాలను బట్టి డాక్టర్ సూచించిన ఈ రేటింగ్స్‌ను పరిగణనలోకి తీసుకొని మీ వర్కవుట్ ప్లాన్ సిద్ధం చేసుకోండి.



# అక్టోబర్‌లో సెట్స్‌పైకి 'బ్లడీ రోమియో'?



గత ఏడాది పవన్‌కల్యాణ్ 'ఓజీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నారు దర్శకుడు సుజిత్. ప్రస్తుతం ఆయన లైనప్‌లో 'ఓజీ' సీక్వెల్‌తో పాటు నానితో 'బ్లడీ రోమియో' సినిమా కూడా ఉంది. 'ఓజీ-2' సెప్టెంబర్‌లో ప్రారంభంకానుందనే వార్తలు కూడా వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం 'ఓజీ-2' సినిమాకు బ్రేక్‌నిచ్చి 'బ్లడీ రోమియో'ను పట్టాలెక్కించేందుకు దర్శకుడు సుజిత్ సిద్ధమవుతున్నారని తెలిసింది. అక్టోబర్‌లో 'బ్లడీ రోమియో' సెట్స్‌పైకి వెళ్తుందని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత 'బ్లడీ రోమియో'తో పాటు 'బ్లాస్ట్' ఫేమ్ సుభాష్ కె రాజ్ డైరెక్షన్‌లో నాని ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

# బేబీ' జోడీ మళ్లీ వస్తోంది..

## ఆనంద్ దేవరకొండ – వైష్ణవి చైతన్య 'ఎపిక్' రిలీజ్ డేట్ ఫిక్స్!




బేబీ' సినిమాతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జోడీ మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్' (Epic) విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్ విడుదల చేసిన ఈ అప్డేట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. తాజాగా చిత్రబృందం ప్రకటించిన వివరాల ప్రకారం, 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్' ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేయగా, అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 'ఫస్ట్ సెమిస్టర్' అనే ట్యాగ్‌తో పోస్టర్‌ను విడుదల చేయడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ కాన్సెప్ట్ వెనుక కథ ఏమిటన్న దానిపై కూడా చర్చ మొదలైంది. ఈ చిత్రానికి ఆదిత్య హసన్ దర్శకత్వం వహిస్తున్నారు. యువతను ఆకట్టుకునే కథ, భావోద్వేగాలతో పాటు వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కార్యక్రమాలు సినిమాపై పాజిటివ్ బజ్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రాన్ని తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వారి బ్యానర్ల నుంచి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. యువ సంగీత దర్శకుడు అజీమ్ మొహమ్మద్ సంగీతాన్ని అందిస్తున్నారు. కథకు తగ్గట్టుగా సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. 2023లో విడుదలైన 'బేబీ' చిత్రం ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కెరీర్‌లో భారీ మలుపు తీసుకొచ్చింది. వీరిద్దరి కెమిస్ట్రీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఇప్పుడు అదే జోడీ మరోసారి కలిసి నటిస్తుండటంతో 'ఎపిక్'పై సహజంగానే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాలో కూడా వీరిద్దరి మధ్య భావోద్వేగభరితమైన కథ, కొత్త తరహా పాత్రలు ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సెప్టెంబర్ 11 విడుదల తేదీ ప్రకటించడంతో 'ఎపిక్'పై సినీ అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 'బేబీ' తర్వాత మరోసారి ఆనంద్ దేవరకొండ – వైష్ణవి చైతన్య జోడీ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రెండో సీజన్‌కు 'ముసాఫిర్ కెఫే' ముస్తాబు



"యాత్రికులు ఈసారి ప్రేమ కథని పూర్తి చేయడానికి తిరిగి వస్తున్నారు" అనే వ్యాఖ్యలతో ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'ముసాఫిర్ కెఫే సీజన్ 2'ని ప్రకటించింది. ముక్కోణపు ప్రేమకథగా రూపొందిన ఈ సిరీస్‌లో బాలీవుడ్ కథానాయకుడు విక్రాంత్ మాస్సే, నాయికలు వేదికా పింటో, మహిమా మక్వానా ప్రధాన పాత్రలు పోషించారు. ఇటీవల విడుదలై ఓటీటీలో సందడి చేస్తున్న ఈ సిరీస్ సుధా, చందర్‌ల ప్రేమకథ ఏమవుతుందనే ఆసక్తిని రేకెత్తిస్తూ యువతలో మంచి ఆదరణ దక్కించుకుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీజన్ 2 రాబోతుందని వెల్లడించింది నెట్‌ఫ్లిక్స్. ఎనిమిది ఎపిసోడ్‌లుగా మొదటి సీజన్‌ని రుచిర్ అరుణ్ తెరకెక్కించారు.

# కరికాల... రెండు భాగాలుగా!

సందీప్‌కిషన్ కథానాయకుడిగా... 'శంబాల' ఫేం యుగంధర్ ముని దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. షైనింగ్ పిక్చర్స్ పతాకంపై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'కరికాల' అనే పేరుని ఖరారు చేసినట్టుగా ప్రకటిస్తూ, బుధవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. అందులో సందీప్‌కిషన్ ఓ యోధుడిగా గుర్రంపై స్వారీ చేస్తూ కనిపిస్తున్నారు. ఇదొక సోషియో ఫాంటసీ డ్రామా చిత్రంగా రూపొందుతున్నట్టు తెలుస్తోంది. రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. తొలి భాగాన్ని వచ్చే ఏడాది జులై 2న, రెండో భాగాన్ని అక్టోబరు 28న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరించనున్న ఈ చిత్రం అత్యాధునిక విజువల్ హంగులతో రూపొందుతోందని, దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యమని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం సమకూరుస్తున్నారు.

# గత పది నెలలు పరీక్షించాయి

గత పది నెలలు తనను ఎంతగానో పరీక్షించాయని జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా అన్నాడు. దాదాపు ఏడాది కాలంగా తాను ఎదుర్కొంటున్న ఫిట్‌నెస్ సమస్యల గురించి అతడు మాట్లాడాడు. 28 ఏళ్ల నీరజ్.. తొడకండరాల గాయం, ఇంకొన్ని చిన్న చిన్న ఇబ్బందులతో సతమతమయ్యాడు. అందువల్లే ఈ సీజన్‌ను ఆలస్యంగా ఆరంభించాడు. అయితే గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో లయను అందుకున్న అతడు.. 85.83మీ త్రోతో రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. "గత 10 నెలలు నేను ఊహించనంతగా నన్ను పరీక్షించాయి" అని ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో నీరజ్ చెప్పాడు. అనేక గాయాల నుంచి కోలుకున్నానని, కేవలం పోటీపడడం కోసం తపించిపోయానని అన్నాడు. ఓపికగా ఉండడం నేర్చుకున్నానని నీరజ్ తెలిపాడు. "ఈ ఏడాది పోటీపడగలనో లేదో తెలియకున్నా.. ప్రతిరోజూ సాధన చేశా" అని అతడు చెప్పాడు. 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం నెగ్గిన నీరజ్.. గాయం వల్ల గత 2022 క్రీడలకు దూరమయ్యాడు. నిరుడు సెప్టెంబరులో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌స్‌కు కొద్ది రోజుల ముందు అతడికి వెన్నుగాయమైంది. దీంతో ఈ ఏడాది సీడబ్ల్యూజీకి ముందు కేవలం ఒకే ఈవెంట్లో నీరజ్ పోటీపడ్డాడు. గ్లాస్గోలో నీరజ్ కన్నా ఉత్తమ ప్రదర్శన (89.75మీ)తో శ్రీలంకకు చెందిన రుమేశ్ పతిరగె స్వర్ణం చేజిక్కించుకున్నాడు. తన పునరాగమనానికి సహకరించిన సహాయ సిబ్బందికి నీరజ్ కృతజ్ఞతలు తెలిపాడు. "తిరిగి అత్యున్నత స్థాయిలో పోటీపడుతున్నందుకు సంతోషంగా ఉంది. సొంతంగా నాకు ఇది సాధ్యమయ్యేది కాదు. ఎల్లప్పుడూ నాపై విశ్వాసం ఉంచిన వ్యక్తులకు కృతజ్ఞతలు. నా ఫిజియో ఇషాన్ నాకెంతో మద్దతుగా నిలిచాడు. ప్రతి అడుగులో నాకు తోడుగా ఉన్నాడు. నేను తొలిసారి జావెలిన్ అందుకున్నప్పటి నుంచి నా కోచ్ జై నాతో ఉన్నాడు. నా కుటుంబం అన్నివేళలా నాకు అండగా నిలిచింది" అని నీరజ్ పేర్కొన్నాడు.



# సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లిన క్రికెటర్లు బరువు పెరుగుతున్నారా..?




ఆటగాళ్ల గాయాల విషయంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తీరుపై విమర్శలు వస్తున్నాయి. అక్కడికి వెళ్లిన ఆటగాళ్లు బరువు అధికంగా పెరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. హర్షిత్ రాణా సీవోఈకి వెళ్లాక నాలుగు కేజీల బరువు పెరిగాడట. దీనివల్లే అతడు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అడిగినట్లు కథనాలు వస్తున్నాయి. మరోవైపు యో-యో టెస్టు స్థానంలో అమలు చేస్తోన్న బ్రాంకో టెస్టుపైనా బీసీసీఐ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దీంతో సీవోఈలో పెను మార్పులకు క్రికెట్ బోర్డు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలుస్తోంది.

కారణమేంటి కమలేశ్?

ఆటగాళ్ల ఫిట్‌నెస్ ప్రమాణాలు పడిపోవడానికి గల కారణాల గురించి చీఫ్ ఫిజియో కమలేశ్ జైన్‌పై బీసీసీఐ ప్రశ్నల వర్షం కురిపించినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంగ్లాండ్ పర్యటన సమయంలో పలువురు ప్లేయర్లు కండరాలు పట్టేయడం వంటి సమస్యతో బాధపడ్డారు.

అలాగే అధిక బరువుతో ఉన్నప్పటికీ హర్షిత్‌కు క్లీన్‌చీట్ ఇవ్వడంపైనా ఆగ్రహం వ్యక్తమైంది. "ఆటగాడి స్థాయిని చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు. సంతృప్తిగా అనిపించని అంశాలను నిర్భయంగా ప్రస్తావించాలని కమలేశ్‌కు బీసీసీఐ పెద్దలు సూచించారు. ఎందుకంటే కొందరి ఆటగాళ్ల కదలికలు మైదానంలో సరిగ్గా లేవనిపించింది. మరీ ముఖ్యంగా సీనియర్ బ్యాటర్లు ఎక్కువ సమయం క్రీజ్‌లో ఉంటే.. వికెట్ల మధ్య వేగంగా పరిగెత్తడంలో ఇబ్బంది పడుతున్నారు. ఫీల్డింగ్‌లో వేగంగా ఉండేవారి సంఖ్య తగ్గిపోయింది. ఇక హర్షిత్ రాణా బరువు 4 కిలోలు ఎక్కువగా ఉందని మేనేజ్‌మెంట్ గుర్తించింది. ఈ విషయంలో సీవోఈ మరింత అప్రమత్తంగా ఉండాల్సింది.

అతడి బరువు 96 కిలోలకు మించకూడదని సిబ్బంది ఇప్పుడు సూచించారు. ప్రస్తుతం 94 కేజీల బరువుతో ఉన్నాడు. అయితే, ఇంగ్లాండ్ పర్యటనకు అతడిని ఎంపిక చేసినప్పుడు బరువు 97 కేజీల వరకూ ఉంది. దీనిపైనా చీఫ్ ఫిజియోను బీసీసీఐ వివరణ కోరింది" అని బోర్డు వర్గాలు తెలిపాయి.

# భారత్‌తో వార్మప్ మ్యాచ్.. శ్రీలంక ఎలెవన్ జట్టు ప్రకటన

రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా తొలుత వార్మప్ మ్యాచ్ ఆడనుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొలంబో క్రికెట్ క్లబ్ మైదానంలో శ్రీలంక ఎలెవన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఉదయం 10 గంటలకు మొదలుకానుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షప్రసారం ఉంటుంది. భారత్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ కోసం 15 మందితో శ్రీలంక జట్టును ప్రకటించింది. యువ బౌలింగ్ ఆల్‌రౌండర్ సోనల్ దినూషను కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

ప్రధాన జట్టులో చోటు దక్కించుకోవడం కోసం పోటీపడుతున్న ఏడుగురు కీలక ఆటగాళ్లు శ్రీలంక ఎలెవన్ టీమ్‌లో ఉన్నారు. కెప్టెన్ దినూషతో పాటు పేసర్లు లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, ఆఫ్ స్పిన్నర్ రమేశ్ మెండిస్, నిషాన్ మదుష్క, పవన్ రత్నాయకే అంజల బండార ఈ జాబితాలో ఉన్నారు.ఇండియా ఎతో మ్యాచ్‌లో 10 వికెట్లు తీసి ఆకట్టుకున్న లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ దిలుమ్ సుదీర, ఐదు వికెట్లు పడగొట్టిన కేసర నువాంత వంటి ప్రతిభావంతులు కూడా శ్రీలంక ఎలెవన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఆగస్టు 15 నుంచి మొదలుకానున్న రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంక ఇంకా అధికారికంగా జట్టును ప్రకటించలేదు. స్పిన్‌కు అనుకూలించే శ్రీలంక పిచ్‌లను అర్థం చేసుకోవడానికి వార్మప్ మ్యాచ్ టీమ్‌ఇండియాకు బాగా ఉపయోగపడనుంది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314